
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 17 నవంబరు 2025

గరిష్ఠం 27.0
కనిష్ఠం 16.2



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.50 (302.9125)	14,274	14,274
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.10 (4.22)	1,352.42	1,568.68
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్: రూ.152 | డ్రెస్: రూ.230 | స్కిన్‌లెస్: రూ.260



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పశు వైద్యానికి మందుల కటకట ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖకు మందుల కొనుగోలు కోసం అరకొర నిధులు కేటాయిస్తుండటంతో అధికారులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. పశుసంపదను కాపాడాలని, పాడి ఉత్పత్తులను పెంచాలని, గొర్రెలు, మేకలను సంపదను పెంచి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నా నిధుల కేటాయింపు మాత్రం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

పశు వైద్యానికి నిధులు అరకొరే

- ప్రతీ మూడు నెలలకోసారి రూ.1.50కోట్లు మాత్రమే
- వాస్తవానికి కావాల్సిన నిధులు రూ.6.50కోట్లపైనే
- నిధులు విడుదలలోనూ ఎడతెగని జాప్యం
- 130 రకాల మందులు కొనుగోలు చేయలేని పరిస్థితి

ప్రభుత్వం పశు వైద్యం కోసం నిధులు నామమాత్రంగా కేటాయించడంతోపాటు, మేకల, గొర్రెల యూనిట్ల పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పశువైద్య, ఆ శాఖ బలోపేతం కోసం కేటాయించిన నిధులు నామమాత్రమే. దీంతో పశు వైద్యానికి ఉన్న మందులతోనే సంబంధిత శాఖ అధికారులు నెట్టుకువస్తున్నారు. పశువులకు ఏదైనా జబ్బు చేసినప్పుడు సంబంధిత యజమాని పశువుల దవాఖానాకు వెళ్తే రోగానికి అనుగుణంగా వైద్యులు మందులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో జీవాల యజమానులు ప్రైవేట్ దుకాణాల్లో మందులు కొనుగోలుచేసి వినియోగిస్తున్నారు. అదేవిధంగా సంబంధిత శాఖకు ల్యాబ్ కూడా అందుబాటులో లేకపోవడం, ఉన్న ల్యాబ్‌లో సరైన పరికరాలు కూడా లేవు.

7.56లక్షలకు పైగా పశువులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పశుగణన ప్రకారం 7,56,300 తెల్ల, నల్ల పశువులు ఉండగా, 24లక్షల వరకు మేకలు, గొర్రెలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 1,80,200 గేదెలు, ఆవులు ఉండగా, నల్లగొండ జిల్లాలో 3,20,600 గేదెలు, ఆవులు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 2,5,500 గేదేలు, ఆవులు ఉన్నాయి. పశువులు, జీవాలకు వైద్యం అందించేందుకు ఉమ్మడి జిల్లాకు ప్రతి మూడు నెలలకొకసారి (క్వార్టర్లీ) రూ.6.50కోట్లు అవసరం. కాగా, ప్రభుత్వం కేవలం రూ.1.50కోట్లు మాత్రమే ప్రస్తుతం మంజూరు చేస్తోంది. అవి కూడా ఆరు నెలలకోసారి నిధులుచెల్లిస్తోంది. దీంతో మూడు నెలలకోసారి మందులు కొనుగోలుచేయలేక శాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మందుల కోసం ప్రతీ మూడు నెలలకు నల్లగొండ జిల్లాకు రూ.60లక్షలు కేటాయిస్తుండగా, యాదాద్రి జిల్లాకు రూ.40లక్షలు, సూర్యాపేట జిల్లాకు సుమారు రూ.50లక్షలు కేటాయిస్తోంది. ఈ నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రత్యేకంగా నట్టల మందుల కోసం రూ.2కోట్ల వరకు నిధులను ప్రభుత్వం మంజూరు చేయగా, సాధారణ రోగాల మందులకు సంబంధించిన కేటాయింపులు ఉండటం లేదు. నట్టల నివారణ కోసం ప్రత్యేకంగా ప్రతీ ఆరు నెలలకు రాష్ట్ర స్థాయిలో కేటాయింపులు జరుగుతున్నాయి. అంతే తప్ప పశువైద్యానికి మాత్రం నిధులు నామమాత్రంగా ఉంటున్నాయి. మూడు జిల్లాలకు చెందిన పశుసంవర్ధక శాఖ అధికారులు జిల్లాలో ఉన్న పశుసంపదకు అనుగుణంగా మందుల కోసం ఇండెంట్ పెడుతున్నా కేటాయింపులు సాధారణంగానే ఉంటున్నాయి.



130 రకాల మందుల కొనుగోలు ఎలా?

పశువుల మందుల కొనుగోలు కోసం ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం క్వార్టర్లీ కేవలం రూ.1.50కోట్లు మాత్రమే నిధులు కేటాయిస్తోంది. దీంతో 130 రకాల మందులను ఎలా కొనుగోలుచేయాలో తెలియగా పశుసంవర్ధకశాఖ అధికారులు ఇబ్బందిపడుతున్నారు.

- మిగతా 8వ పేజీలో...

పశువుల వైద్యానికి సరిపడా మందులు ఉన్నాయి

పశువైద్యానికి సరిపడా మందులు ఉన్నాయి. పశువుల వైద్యం కోసం ఎలాంటి ఇబ్బంది లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకొకసారి మందుల కొనుగోలు కోసం నిధులు కేటాయిస్తుంది. పశువుల సంఖ్యకు అనుగుణంగా మందుల కోసం నిధులు వస్తున్నాయి. ప్రతి పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువులకు వచ్చే వ్యాధులను దృష్టిలో ఉంచుకొని మందులు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నాం. ఆయా ప్రాంతాలలో ఉండే రైతులు తమ పశువులను ఆయా వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించాలి. అదేవిధంగా డాక్టర్లు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యాన్ని నిరంతరం అందజేస్తున్నారు.

- డాక్టర్ జీవి. రమేష్, పశుసంవర్ధకశాఖ జేడీ నల్లగొండ

నేటి నుంచి పాఠశాలల తనిఖీ

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే



మోత్కూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయనుంది. పాఠశాలల్లో వసతులు, విద్యార్థుల రక్షణ, పరిశుభ్రత, అభ్యసనా సామర్థ్యాల పరిశీలనకు విద్యాశాఖ స్పెషల్ క్యాంపెయిన్ 5.0 పేరుతో పాఠశాలల తనిఖీ చేపట్టేందుకు నిర్ణయించింది. అందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను సైతం నియమించింది. యాదాద్రి జిల్లాలో పాఠశాలల తనిఖీకి ఇన్‌చార్జిగా పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ లింగయ్యను, నల్లగొండకు ఎస్‌ఈఆర్టీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.రాజేష్‌ను, సూర్యాపేట జిల్లాకు నల్లగొండ డైట్ ప్రిన్సిపాల్ నర్సింహను నియమించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తించిన పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలలను ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు తనిఖీ చేయనున్నారు. జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తారు. వీరు తొలి రోజు ఐదు పాఠశాలలను తనిఖీచేస్తారు. రెండో రోజు మూడు పాఠశాలలను తనిఖీచేసి అదేరోజు జిల్లా కేంద్రంలో డీఈవోతో కలిసి ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తారు.

తనిఖీ చేసే అంశాలివే..

పాత ఫైళ్లు, పగిలిన వస్తువులు, మరమ్మతు చేయలేని ఫర్నీచర్ తొలగింపు, భవనాల పైకప్పులపై నీరు నిల్వకుండా చేసిన పనులను తనిఖీచేస్తారు. దెబ్బతిన్న పాఠశాలల్లో ఎలక్ట్రికల్ వైరింగ్, ఫ్యాన్స్, లైట్లు మెయింటెనెన్స్ గ్రాంట్ నుంచి వేయించడం, గోడల పగుళ్లు, తలుపులు, కిటికీల్లో లోపాలు ఉంటే సవరించారా? లేదా? చూస్తారు. మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావడం, గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ సిబ్బంది సహాయంతో పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్ల తొలగింపును పరిశీలిస్తారు. భవనాలకు హాని కలిగించే చెట్లు ఉంటే తొలగించడం, మరమ్మతులతో వినియోగించుకునే ఫర్నీచర్, పాఠశాల ప్రహరీ వెంట మొక్కలు నాటించారా లేదా చూస్తారు. పాఠశాలల్లో వివిధ సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటారు. భవిష్యత్‌లో పాఠశాలలను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు మండలానికి ఒక బెస్ట్ స్కూల్‌ను ఎంపిక చేసేందుకు ఎంఈవోల నుంచి నివేదిక తెప్పించుకున్నట్టు సమాచారం. భవిష్యత్‌లో ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు విద్య అందిస్తారని సమాచారం.

జిన్నింగ్ మిల్లులు సమ్మె విరమించుకోవాలి


కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండలో జిన్నింగ్‌మిల్లుల యజమానులు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లుల యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సమ్మెను విరమించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ, సహకారశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌కు ఫోన్ చేసి జిన్నింగ్ మిల్లుల సమస్యలను వివరించారు. దీంతో రాష్ట్ర అసోసియేషన్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని జిన్నింగ్ మిల్లుల యజమానులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పలు సమస్యల కారణంగా జిన్నింగ్ మిల్లుల యజమానులు పత్తిని కొనుగోలు చేసేందుకు విముఖత చూపారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషిచేస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తిని కొనుగోలు చేసేందుకు సమ్మెను విరమించుకోవాలన్నారు. జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లులకు 18మిల్లుల్లో కొనుగోళ్లు ప్రారంభించామని, మిగిలిన వాటిని కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జిన్నింగ్ మిల్లు యజమానులు పత్తిని కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. పత్తి రైతులు 12 క్వింటాళ్ల వరకు సీసీఐకి విక్రయించవచ్చని, ఈ విషయాన్ని అధికారులు రైతులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఏఈవోల సాఫ్ట్‌వేర్‌లో అందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సీసీఐ కేంద్రాలకు రైతులు నాణ్యమైన పత్తి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి ఛాయాదేవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట



- విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రద్దీ
- హైదరాబాద్ వైపు పెద్ద సంఖ్యలో వెళ్తున్న వాహనాలు
- పెద్దకాపర్తి, చిట్యాల వద్ద నిదానంగా ప్రయాణం

చిట్యాలరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులతో 65వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా మారుతోంది. సెలవుల్లో సొంతూర్లకు వెళ్లిన వారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావడంతో ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. చిట్యాల, పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుండగా, అక్కడ వాహనాలను దారి మళ్లించడంతో వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు చిట్యాల మీదుగా హైదరాబాద్, భువనగిరి, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ముంబాయి, నాగ్‌పూర్, పలు ప్రాంతాలకు వెళ్తుంటాయి.

దీంతో చిట్యాలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. వాహనాలు ఒకేసారి రావడం, అక్కడక్కడ గుంతలు ఏర్పడటం, చిట్యాల, పెద్దకాపర్తిలో ఫ్లైఓవర్ బ్రిడ్జీల నిర్మాణం జరుగుతుండటంతో ఆయా ప్రాంతాల్లో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయి ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట పడుతోంది. రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బందితో వాహనాలను నియంత్రించారు. అనంతరం వాహనాలు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని మరచిన ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నల్లగొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విస్మరించిందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్‌లు అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓవైపు విద్యార్థులు చలికి వణికిపోతుంటే కనీసం దుప్పట్లు, రగ్గులు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్ర రూపం దాల్చడంతో జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల విద్యార్థులు చలికి వణికిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కలెక్టర్ ప్రభుత్వంతో మాట్లాడి విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు, ఉన్ని స్వెటర్లు అందించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా వసతిగృహ విద్యార్థులు ఉదయం పూట చన్నీటి స్నానాలు చేయడంతో జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. అన్ని వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు వేడి నీటిని ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా పేద మధ్య తరగతి విద్యార్థులందరికీ గత ప్రభుత్వ మాదిరిగా రగ్గులు, స్వెటర్లు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్, సహాయ కార్యదర్శి కరెం రవి, చేగువేరా, హర్షవర్ధన్, నవీన్, జాన్సన్, నవదీప్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దీక్ష

నల్లగొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సన్న ధాన్యానికి బోనస్ చెల్లించాలని, ఫసల్ బీమాను అమలు చేయాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని దీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

బీఆర్ఎస్‌ను బలహీనపర్చే కవిత కుట్రలను సాగనివ్వం

జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చే విధంగా కల్వకుంట్ల కవిత చేస్తున్న కుట్రలను ఇకపై ఎట్టి పరిస్థితుల్లో సాగనిచ్చేది లేదని జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవితను ఇన్ని రోజులు తమ పార్టీ అధినేత కేసీఆర్ కుమార్తె అయినందున గౌరవిస్తూ వస్తున్నామని అందుకే ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేసినా ఇప్పటివరకు ఏమి అనలేదని, ఇక నుంచి తగిన రీతిలో సమాధానం చెప్పి ప్రజల్లో ఎండగడతామన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్, జగదీష్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ పార్టీలో విబేధాలు తేవాలని కవిత చూస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడితే అదే వ్యాఖ్యలు చేస్తున్నారని, సీఎం కంపెనీలో కవితకు భాగస్వామ్యం ఉందని, అందుకే ఆమె కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్‌ను శత్రువుగా పరిగణిస్తోందని అన్నారు. పార్టీని ఇబ్బందులకు గురి చేస్తున్నందునే కేసీఆర్ ఆదేశంతోనే ఆమెను సస్పెండ్ చేశారన్నారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిని అన్న అని సంబోధిస్తున్న ఆమె, సొంత అన్నను, కుటుంబాన్ని మాత్రం శత్రువుగా చూస్తోందన్నారు. ఆమె వ్యవహారశైలి చూస్తుంటే లిక్కర్ స్కామ్‌లో ఆమె పాత్ర ఉందని భావించాల్సి వస్తుందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లను ఒంటరి చేయాలని కవిత చూస్తోందని, ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో బలహీనపర్చాలని చూస్తే నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని అన్నారు. నిరంతరం ప్రజల మధ్యే ఉండే కేటీఆర్‌ను విమర్శించే అర్హత కవితకు లేదన్నారు. కవితను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీకి వచ్చే సాధారణ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. విలేకరుల సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు నిరంజన్ వలీ, మాలె శరణ్యారెడ్డి, కొండూరు సత్యనారాయణ, అభిమన్యు శ్రీనివాస్, జమాల్ ఖాద్రీ, మైనం శ్రీనివాస్, ఐతగోని యాదయ్య, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మిర్యాలగూడలో మంత్రుల పర్యటన

ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రులు రోడ్లు, భవన నిర్మాణాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మిర్యాలగూడకు రానున్నారు. సోమవారం కళాశాల నూతన భవనాల ప్రారంభోత్సవం, టీఎఫ్ఐడీ కింద మునిసిపాలిటీల్లో చేపట్టనున్న డ్రైన్లు, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన కోసం మంత్రులు మిర్యాలగూడకు రానున్న సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రులు ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మిర్యాలగూడ బైపాస్ వద్దకు చేరుకుంటారన్నారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా కాల్వపల్లికి చేరుకుని శెట్టిపాలెం-అవంతీపురం ఔటర్ రింగు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, ఈదులగూడెం బైపాస్ వద్ద కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన భవనానికి ప్రారంభోత్సవం చేస్తారని అన్నారు. పట్టణంలోని సాగర్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్ద మునిసిపాలిటీ పరిధిలో రూ.75.25కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యకలాపాలు శిలాఫలకాలు ఆవిష్కరిస్తారని చెప్పారు. పట్టణంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దేవస్థానంలో మహాఅన్నప్రసాద కార్యక్రమం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో నిర్వహించే విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. వారి వెంట పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, మిర్యాలగూడ తహసీల్దార్ సురేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

మెగా లోక్‌అదాలత్‌లో 6,362 కేసుల పరిష్కారం


ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 6,362 కేసులు పరిష్కరించినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టు విచారణలో ఉన్న కేసులు 548, డ్రంకెన్ డ్రైవ్, ఎంవీ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన కేసులు 2,515 పరిష్కారమయ్యాయన్నారు. ఈ-పెట్టి కేసులు 3,254, సైబర్ క్రైంకు సంబంధించి 45 కేసుల్లో రూ.8,84,642లను బాధితులకు అందజేశామన్నారు. మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, సిబ్బంది కక్షిదారులకు అవగాహన కల్పించారని, ఈ సందర్భంగా అభినందించారు.

ఎస్పీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

ఎస్పీ శరత్‌చంద్రపవార్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్‌ను రూపొందించారు. దాని నుంచి వచ్చే మెసేజ్‌లకు ఎవ్వరూ స్పందించవద్దని ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఫేస్‌బుక్ ప్రొఫైల్ నుంచి డబ్బు గానీ, సమాచారం గానీ అడిగితే స్పందించవద్దని కోరారు. ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సహకరించకపోతే రాజకీయ సమాధి తప్పదు



జిల్లా కేంద్రంలో రన్‌ఫర్ సోషల్ జస్టిస్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై సహకరించని రాజకీయ పార్టీలకు రాజకీయ సమాధి తప్పదని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు హెచ్చరించారు. బీసీలకు సామాజిక న్యాయం కోసం ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో రన్‌ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు తరతరాలుగా సామాజికంగా అన్ని రంగాల్లో వివక్షతకు, దోపిడీకి గురవుతున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు దాటినా, నేటికి కూడా చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పించలేదన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారు జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్ పొందుతుంటే బీసీలకు మాత్రం అన్యాయం జరుగుతోందని అన్నారు. బీసీలు ఇప్పటికైనా ఐక్యంగా హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి రాష్ట్రంలో 56శాతం బీసీలు ఉన్నారని లెక్కలు తేల్చి 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి, గవర్నర్, రాష్ట్రపతికి పంపినా స్పందన రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కేశబోయిన శంకర్, కాసోజు విశ్వనాథం, నకిరేకంటి కాశయ్య, చిక్కుల రాములు, ఇంద్రయ్య, కంది సూర్యానారాయణ, నాగులపల్లి శ్యాంసుందర్, బొమ్మరబోయిన కేశవులు, సాయిబాబా, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, సీతారాములు, సత్యనారాయణ, భాస్కర్, శంకరాచారి, సమీర్, శంకర్, మాధవి, మధు, శివ, లింగస్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

● మిగులు భూమిని మింగేశారు



చండూరు పరిధిలో వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్లాట్లు

భూములు ఖాళీగా కనిపిస్తే అక్రమార్కులు కన్నేస్తున్నారు. పంట పొలాలను సైతం వదలడంలేదు. ప్లాట్లుగా మార్చి అమాయకులకు అంటగడుతున్నారు. రిజిస్ట్రేషన్ అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు, రాజకీయ నాయకులే ఈ తంతంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి-చండూరు)

నల్లగొండ జిల్లా చండూరు పరిధిలోని విలువైన భూములను కొంత మంది ఆక్రమించుకొని ప్లాట్లుగా చేస్తున్నారు. ముఠాగా ఏర్పడి 10 నుంచి 20 ఎకరాలకు అనుమతి పొందినట్లు వెంచర్లు చేస్తూ.. అమాయక ప్రజలకు అంటగడుతున్నారన్న చర్చ సాగుతోంది. అయితే లేఅవుట్లుగా చూపి, ప్లాట్లుగా తయారుచేసి ఎలాంటి ప్లాట్ నెంబర్లు లేకుండా విక్రయాలు జరుపుతున్నారన్న చర్చ జరుగుతోంది.

చండూరు శివారులో సర్వే నెంబర్ 188, 216, 217లలో శ్రీసాయి వేంకటేశ్వర వండర్ సిటీ పేరుతో కొందరు రియల్టర్లు వెంచర్‌వేసి ప్లాట్లుచేశారు. వ్యవసాయ భూమికి అప్పటి నల్లగొండ ఆర్డీవో 2019 జూన్29న ఇ-1151-2019, ఇ-1152-2019 అనుమతి ఇచ్చారు. కానీ దాని పక్కనే ఉన్న 206 సర్వే నెంబర్‌లో రూ.1.8కోట్ల విలువైన 36 గుంటల భూమిని కూడా రియల్టర్లు కబ్జాచేశారు. సర్వే నెంబర్ 217లో కూడా పూర్వపు బండ్లబాట.. నక్ష ప్రకారం ఉండగా దానిని కూడా కబ్జా చేసినట్లు తెలుస్తోంది. ఏడాది క్రితం ఈ భూమి కబ్జా చేసినట్లు మండలానికి చెందిన ఓ వ్యక్తి 2024 డిసెంబరు 3న చండూరు ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా, స్వాధీన పరుచుకోవాలని చండూరు తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సైతం వెంచర్లో ప్రభుత్వ భూమి ఉందని గుర్తించినప్పటికీ, హద్దురాళ్ల పాతకుండా నిర్లక్ష్యం చేశారన్న విమర్శలున్నాయి. దీంతో వెంచర్ నిర్వాహకులు ప్లాట్లను యథేచ్ఛగా విక్రయించారు. ఈ కబ్జా బాగోతం బట్టబయలు కావడంతో ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు. హద్దు రాళ్లు పాతి కంచె ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిని కాపాడడానికి అలసత్వం వహిస్తున్న రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రభుత్వ స్థలం కబ్జా చేసినట్లు గుర్తించాం

శ్రీసాయి వేంకటేశ్వర వండర్ సిటీ పేరుతో ఏర్పాటు చేసిన వెంచర్‌లో 36 గుంటల ప్రభుత్వం ఉంది. కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు అందింది. డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్‌తో కలిసి పరిశీలించారు. వెంచర్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జా గురైనట్లు గుర్తించాం. స్థలాన్ని ఇప్పటికే మా ఆధీనంలోకి తీసుకున్నాం. రెండు, మూడు రోజుల్లో చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

రమాకాంత్, తహసీల్దార్, చండూరు

అనుమానాస్పద మృతిపై దర్యాప్తు

● వివిధ కోణాల్లో విచారణ

సూర్యాపేటరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి పిల్లలమర్రి గ్రామశివారులో లభ్యమైన మృతదేహం వివరాల కోసం పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా అమలాపురంనకు చెందిన సత్యనారయణగా(55) గుర్తించారు. మృతుడు లేబర్ కాంట్రాక్టర్‌గా 20 ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. 2023లో కుటుంబ కలహాలతో భార్యను హత్యచేసి జైలుకు వెళ్లి ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. అయితే భార్య తరపు బంధవులు హతమార్చి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. స్నేహితులు హతమార్చారా ? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో హతమార్చి పిల్లలమర్రి శివారులో మృతదేహన్ని పడేసినట్లు సమాచారం. రెండు బృందాలతో దర్యాప్తు చేస్తున్నామని, అతి త్వరలో నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టిన కారు

పెన్‌పహాడ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి కారు ఢీకొట్టిన ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలకేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాయిగూడెం గ్రామానికి చెందిన కూనం సత్యనారాయణ తన కారులో గరిడేపల్లికి సూర్యాపేట నుంచి బయలుదేరారు. పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చేరుకున్న ఆయన పెన్‌పహాడ్ మూలమలుపులో ఓ కారును క్రాస్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈక్రమంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి, కారుపై పడింది. దీంతో కారు కొంతభాగం ధ్వంసంకాగా, సత్యనారాయణకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

నీతికథలు చదివేవారేరీ?

● పుస్తక పఠనంపై తగ్గిన ఆసక్తి ● బాలల సాహిత్యం.. పిల్లలకు దూరం ● కథల పుస్తకాలను చదవాలంటున్న నిపుణులు



అర్ధ శతాబ్దం క్రితం వరకు చందమామ కథలు చదవని వారు ఉండరు. అమ్మమ్మ, తాతయ్యలు చెప్పే కథలు విని మురిసిపోయే వారు లేరంటే అతిశయోక్తి కాదు. బొమ్మరిల్లు.. చందమామ.. బుజ్జాయి.. బాల జ్యోతి వంటి కథల పుస్తకాలను పిల్లలు ఎక్కువగా చదివేవారు. ఇప్పుడు మారుతున్న కాలానుగుణంగా కథల పుస్తకాలకు ఆదరణ తగ్గుతూ వస్తోంది. ఒకనాడు ఖాళీ సమయాల్లో కథల పుస్తకాలు చదవడంవల్ల కాల క్షేపంతోపాటు విజ్ఞానం కూడా పెంపొందేది.

(ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

టెలివిజన్, మొబైల్‌ఫోన్లు అందుబాటులోకి రావడంతో పిల్లల చేతుల్లోకి పుస్తకాలకు బదులు మొబైల్ ఫోన్లు వచ్చి చేరాయి. ప్రపంచమంతా తమ గుప్పిట్లోనే ఉంది అన్నట్లు పరిస్థితులు మారాయి. దీంతో దశాబ్దాలపాటు ఆదరించిన కథల పుస్తకాలు కంచికి చేరాయి. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కనుమరుగవుతున్న బాలసాహిత్యంపై ప్రత్యేక కథనం..

అమ్మమ్మ, తాతయ్యలు చెప్పే కథలు

ఒకప్పుడు అమ్మమ్మ, తాతయ్యలు చెప్పే కథలను చిన్నారులు ఆసక్తిగా వినేవారు. చాలా మంది చిన్నారులు తమ ప్యాకెట్ మనీతో బొమ్మరిల్లు, చందమామ, బాలజ్యోతి, బేతాల కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, నీతి వ్యాఖ్యలు తదితర కథల పుస్తకాలను కొనుగోలుచేసి చదివేవారు. తాము చదివిన కథలను ఇతర పిల్లలకు చెప్పుకుని మురిసేవారు. దీంతో పిల్లల్లో సృజనాత్మకత అలవడింది. అయితే నేడు కాలానుగుణంగా పరిస్థితుల్లో మార్పు వచ్చింది. బాల సాహిత్యానికి ఆదరణ తగ్గింది. శతాబ్దాలపాటు ఆదరించిన కథల పుస్తకాలను నేడు కొనే దిక్కులేదు. ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు కనబడుతున్నాయి. ఈ గ్యాడ్జెట్లలో అందుబాటులో ఉంటున్న బాల సాహిత్యం కూడా పిల్లలు చదవడంలేదు. కేవలం గేమ్స్ ఆడుతూ సమయాన్ని వృథా చేస్తున్నారు.

సాయంత్రం సమయాల్లో..

గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవి. పెద్దనాన్న, బాబాయ్ కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో ఉండేవారు. దీంతో ఒకే ఇంట్లో కనీసం ఆరేడు మంది చిన్నారులు ఉండేవారు. వారంతా కలిసి సాయంత్రం సమయాల్లో తమ



పెద్దల చుట్టూ కూర్చొని కథలు చెప్పించుకుని ఆనందించేవారు. రాను రాను ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. కథలు చెప్పే వారే కరువయ్యారు. దీంతో కథలతో కలిగే లాభాలు పిల్లలకు తెలియకుండా పోయింది.

విషయ పరిజ్ఞానం పెంపునకు..

కథల పుస్తకాలను చదివితే చిన్నారుల్లో విషయ పరిజ్ఞానం, పఠనాసక్తి పెరుగుతుంది. ఆయా కథల్లో ఉన్న నీతిని, మంచితనాన్ని అలవర్చుకుంటారు. సమయస్ఫూర్తి అలవడుతుంది. ఆలోచన ధోరణి పెరుగుతుంది. తోటివారిపై, మూగజీవాలపై ఎలా ప్రేమ చూపాలో అర్థమవుతుంది. జాలి, దయ వంటి గుణాలు అలవడతాయి. ఉత్తమ పౌరులుగా ఎదగడానికి దోహదపడుతాయి.

ఆన్‌లైన్‌లో కూడా చదవొచ్చు..

ప్రస్తుతం గ్రామాల్లో కథల పుస్తకాలు దొరకడంలేదు. పెద్దపెద్ద పట్టణాల్లో మాత్రమే దొరుకుతాయి. గ్రామాల్లో కూడా 4జీ, 5జీ సెల్‌ఫోన్లు వచ్చాయి. ల్యాప్‌టాప్ యాప్స్ కనిపిస్తాయి. వీటన్నింటిలో కూడా బాలల సాహిత్యమైన నీతి కథలు, బాల్య మిత్ర, చందమామ తదితర పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయి. వీటిని స్క్రీన్‌పై కూడా చదవచ్చు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు

పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు, పలు నైపుణ్యాలను సులువుగా అర్థం చేసుకునేందుకు పఠన పుస్తకాలే మార్గమని భావించి కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం పాఠశాలలకు వందలాది పుస్తకాలను అందించింది. ఆ తర్వాత ఈ విధానాన్ని పూర్తిగా మరిచిపోయింది. గ్రంథాలయాల్లో బాల సాహిత్యం ఉన్నా.. అక్కడికి వెళ్లి చదివే తీరిక పిల్లల్లో లేదు. అసలు తమ పట్టణం, గ్రామాల్లో గ్రంథాలయాలు ఎక్కడ ఉన్నాయో తెలియని స్థితిలో చాలామంది పిల్లలు ఉన్నారు. మరోవైపు పాఠశాలల్లో కూడా గ్రంథాలయాలు ఉండడం లేదు.



చదువుపై ఆసక్తి పెరుగుతుంది

బాల సాహిత్యాన్ని చిన్నారులకు అలవాటు చేయాల్సిన అవసరం ఉంది. కథల ద్వారా చెబితే పిల్లలు విషయాన్ని సులువుగా అర్థం చేసుకుంటారు. చదువుపై ఆసక్తి పెరుగుతుంది. అనేక మంది విద్యావంతులు , మేధావులు ఈ విషయాన్ని అనేక వేదికలపైన చెబుతూనే ఉన్నారు. తల్లిదండ్రులు బాల సాహిత్యంపై దృష్టిసారించి కథల పుస్తకాలు చదివేలా పిల్లలను ప్రోత్సహించాలి.

మేకల రాజశేఖర్ గౌడ్, తెలుగు ఉపాధ్యాయుడు, బీబీనగర్



కథలంటే చాలా ఇష్టం

కథలంటే నాకు చాలా ఇష్టం. మా ఇంట్లో తాత, అమ్మమ్మ, ఇతర పెద్దవాళ్లను అడిగి కథలు చెప్పించుకునే వాళ్లం. నేను చాలా కథల పుస్తకాలు చదివాను. నా ఫ్రెండ్స్‌ను కూడా పుస్తకాలు చదవమని చెబుతున్నా. ప్రస్తుతం ఈ కథల పుస్తకాలు లభ్యం కావడంలేదు. పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి బాల సాహిత్యాన్ని అందుబాటులో ఉంచాలి.

నెల్లుట్ల భవిష్య, 7వ తరగతి, బీబీనగర్

'జీవన్ ప్రమాణ్'తో తప్పనున్న తిప్పలు

● బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు

బీబీనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లు.. రిటైర్డ్ ఉద్యోగులు సులభంగా పెన్షన్లు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటివరకు పెన్షన్ దారులు ఏటా బ్యాంకులకు వెళ్లి జీవిత ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి వచ్చేది. దీంతో పెన్షనర్లు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొనే వారు. వారి కష్టాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధుల సౌలభ్యం కోసం బ్యాంకులకు వెళ్లే పరిస్థితి లేకుండా ఆన్‌లైన్ ద్వారా జీవిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించేందుకు 'జీవన్ ప్రమాణ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. పెన్షనర్లు బయోమెట్రిక్ ఆధారిత డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల ద్వారా జీవిత ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి వస్తుంది. దీని వల్ల ఏటా పెన్షనర్లు పెన్షన్లు పంపిణీచేసే బ్యాంకులకు స్వయంగా వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. దీనికి కావాల్సిందల్లా పెన్షనర్లు జీవన్ ప్రమాణ్ పోర్టల్‌ను లేదా స్మార్ట్ ఫోన్‌లో అయితే జీవన్ ప్రమాణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.



ఆన్‌లైన్‌లో అయితే..

పెన్షనర్లు జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో ఆధార్ నెంబరు, బీపీవో నెంబరు, బ్యాంకు ఖాతా, బ్యాంకు పేరు తదితర వివరాలను నమోదు చేయాలి. బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

మొబైల్ యాప్‌లో..

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఆధార్ ఫేస్ రీడ్, జీవన్ ప్రమాణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తద్వారా ఆధార్, పెన్షన్ నెంబరు, బ్యాంకు ఖాతా, బ్యాంకుపేరు వివరాల నమోదు చేయాలి. ఆపై బయోమెట్రిక్ వేలి ముద్ర, ముఖ గుర్తింపు ధ్రువీకరించుకోవాలి. ఇంకా ఈ సేవలు పోస్టాఫీసులో కూడా అందుబాటులో ఉంటాయి. అంతే కాకుండా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ఆమోదించబడిందా? లేదా? తెలుసుకునేందుకు జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్ నుంచి ఈ ప్రమాణ్ ఐడీని ఉపయోగించి తెలుసుకునే ఉపయోగం ఉంటుంది.

జీవన్ ప్రమాణ్ అంటే..

జీవిత ధ్రువీకరణ పత్రం అంటే పెన్షనర్లు జీవించి ఉన్నారని ధ్రువీకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించే డిజిటల్ పత్రం ఇది.

ఉపయోగాలు..

జీవిత ధ్రువీకరణ పత్రం అంటే పెన్షనర్లు జీవించి ఉన్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధ్రువీకరించే పత్రం. జీవించి ఉన్నంత కాలం. పెన్షన్ పొందేందుకు పెన్షన్‌దారులు ఆయా బ్యాంకులకు వెళ్లి ఏటేటా జీవిత ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సిన అవసరం తప్పుతుంది.

నమోదు చేసుకోవడానికి గడువు

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి నవంబరు 1నుంచి 30వరకు ఉంటుంది.

అత్తారిల్లు తగలబెట్టిన అల్లుడు

నార్కట్‌పల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అత్తగారింటికి అల్లుడు నిప్పు పెట్టాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు యన్నమల్ల యశోద తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మాని గ్రామానికి చెందిన యన్నమల్ల యశోదకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెల పెళ్ళిళ్లు చేసింది. కుమారుడు నల్లగొండలో ఉంటున్నాడు. భర్త చనిపోవడంతో యశోద స్వగ్రామంలో ఒంటరిగా ఉంటుంది.

భార్యను దూరం చేస్తున్నావంటూ..

యాదాద్రి భువనగిరి జిల్లా షాపురం గ్రామానికి చెందిన బూర్గుల చంద్రయ్యకు యశోద రెండో కుమార్తె సునీతను ఇచ్చి వివాహం చేసింది. గత మూడేళ్లగా భర్తతో విభేదాలతో సునీత తన ముగ్గురు పిల్లలను తీసుకుని వచ్చి తల్లితో కలిసి నెమ్మానిలో ఉంటుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నెమ్మానిలోని అత్తగారింటికి చంద్రయ్య వచ్చేసరికి భార్య సరిత ఇంట్లో లేదు. దీంతో తన భార్య సునీత గురించి అత్త యశోదను ప్రశ్నించిన చంద్రయ్య తనకు తన భార్యను దూరం చేస్తున్నావంటూ అత్త యశోదతో గొడవ పడిన చంద్రయ్య ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో యశోద ఇంట్లోనుంచి పారిపోయి గ్రామంలోని మరొకరి ఇంట్లో రాత్రి తల దాచుకుంది. భార్య ఇంట్లో లేకపోవడంతో ఆగ్రహించిన చంద్రయ్య రాత్రి అక్కడే ఉండి వెళుతూ అత్తగారింటికి నిప్పు పెట్టి వెళ్లాడు. ఇది ఎవరూ గమనించకపోవడంతో తెల్లవారే సరికి ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఆదివారం ఉదయం యశోద ఇంటికి వచ్చి చూసే సరికి ఇల్లంతా తగలబడిపోయి ఉంది. దీంతో తన ఇల్లు తగలబెట్టిన బూర్గుల చంద్రయ్యపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలంటూ ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై యశోద ఫిర్యాదు మేరకు చంద్రయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు నార్కట్‌పల్లి పోలీసులు తెలిపారు.

కుమార్తె పుట్టిందనే సంతోషం తీరకుండానే..

● రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం
● కుమార్తెను చూసి తిరిగివస్తుండగా రోడ్డు ప్రమాదం
● నల్లగొండ జిల్లాలో వేములపల్లిలో ఘటన



వేములపల్లి మండలకేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసరావు, ఇన్‌సెట్‌లో (ఫైల్)

వేములపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుమార్తె పుట్టిందనే సంతోషం తీరకుండానే ఓ తండ్రి అనంతలోకాలకు వెళ్లాడు. కుమార్తెను చూసి తిరిగి వస్తుండగా ఆదివారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా అనుమాలిపేట మండలం వేటపాలెం గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాసరావు(34) హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ చందానగర్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం కుమార్తె పుట్టడంతో చూసేందుకు ద్విచక్రవాహనంపై ఈ నెల 13వ తేదీన స్వగ్రామం వేటపాలెం ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరాడు. వేములపల్లి మండల కేంద్రం సమీపంలోకి చేరుకోగానే ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం నెమ్మది కావడంతో శ్రీనివాసరావు నడుపుతున్న ద్విచక్ర వాహనం దానికి తాకింది. ఈ క్రమంలో శ్రీనివాస్‌రావు అదుపుతప్పి కింద పడిపోగా, అదే సమయంలో పక్క నుంచి వెళ్తున్న ట్రాక్టర్ అతని ఛాతిపై నుంచి వెళ్లింది. గమనించిన పోలీసులు, స్థానికులు వెళ్లి చూడగా శ్రీనివాసరావు విగితజీవిగా పడి ఉన్నాడు. సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాసరావుకు భార్య భువన, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 30వ తేదీన శ్రీనివాసరావు తమ్ముడి వివాహం జరగాల్సి ఉండగా, ఈ ఘటనతో వారి ఇంట్లో విషాదఛాయలు నెలకొన్నాయి. శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బతకాలంటే.. వెతకాల్సిందే

● బతుకు దెరువుకోసం పొద్దస్తమానం డ్రైనేజీలోనే ● దుర్వాసన భరిస్తేనే కుటుంబ పోషణ... లేదంటే పస్తులే ● అష్ట కష్టాలు పడుతున్న జలకడుగులు

కుటుంబ పోషణ కోసం ఒక్కొక్కరు ఒక్కో రకమైన పనులు చేస్తూ బతుకుబండిని లాగిస్తుంటారు. కానీ వీరు మాత్రం సమాజంలో ఎవరూ సాహసించని వృత్తిని ఎంచుకున్నారు. మూడు పూటలా తినాలంటే పొద్దస్తమానం డ్రైనేజీలో ఉండాల్సిందే. లేదంటే పస్తులు తప్పవు. పొద్దస్తమానం కష్టపడ్డా వచ్చేది రూ.300 కూడా దాటదు. జానెడు పొట్టకోసం అష్టకష్టాలు పడుతున్న జలకడుగుల జీవన చిత్రం ఇది.

(ఆంధ్రజ్యోతి-రామగిరి)

ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాల్లోని అత్యల్ప వర్గానికి చెందిన వీరు స్వర్ణకారుల నుంచి చేజారిన బంగారాన్ని వెతుక్కునేందుకు మోరీలను కడుక్కునే వృత్తిని ఎంచుకున్నారు. బతుకుదెరువుకోసం నల్లగొండ పట్టణానికి 30 ఏళ్లక్రితం 20 కుటుంబాలకు పైగా వలస వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. పట్టణంలోని పాత బస్తీలో స్వర్ణకార వీధిలో బంగారం పని చేసుకుంటున్న క్రమంలో చేతి నుంచి చేజారిన చిన్న చిన్న రవ్వ ముక్కలను ఈ జలగడుగులు పోగుచేసుకొని యాసిడ్‌లో ఉడకబెట్టి వాటిని తిరిగి స్వర్ణకారులకు విక్రయిస్తూ కుటుంబాలను వెళ్లదీసుకుంటున్నారు.

తెల్లవారకముందే డ్రైనేజీలోకి..

నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలో సుమారు 500కుపైగా స్వర్ణకార దుకాణాలు ఉంటాయి. అయితే స్వర్ణకారులు వృత్తిని చేస్తున్న క్రమంలో కంటికి కనిపించకుండానే కొన్ని బంగారం, వెండి రవ్వ ముక్కలు, ఆకురాయి చూర వంటివి దుకాణాల సమీపంలో ఉండే రోడ్లపై, మురుగుకాల్వల్లో ఎగిరి పడుతుంటాయి. అయితే వీటిని పోగు చేసుకునేందుకు జలగడుగులు తెల్లవారుజామున 3గంటలకే స్వర్ణకారుల వీధిలోకి అరుగులు, రోడ్లు ఊడ్చుకోవడంతోపాటు సమీపంలో ఉండే డ్రైనేజీ కాల్వల్లోకి దిగుతారు. అందులో బంగారం ఏమైనా దొరుకుతుందేమో అన్న చిన్న ఆశతో డ్రైనేజీలోని వాసనను భరిస్తూ.., మానవ వ్యర్థ పదార్థాలను సైతం కడిగి అందులో దొరికే బంగారాన్ని ఒడిసిపడ్తారు. ఇలా వరుసగా మూడు రోజులపాటు కష్టపడితే మహా అయితే రూ.వెయ్యికు మించవు. రోజుకు కనీసం రూ.300మాత్రం కూడా గిట్టడం లేదని సదరు జలగడుగులు దీనంగా చెపుతున్నారు.



నల్లగొండలో డ్రైనేజీ కాల్వల్లో బంగారం కోసం జల్లెడ పడుతున్న కార్మికుడు

దొరికిన బంగారాన్ని స్వర్ణకారులకే విక్రయిస్తూ..

పొద్దస్తమానం డ్రైనేజీల్లోకి దిగి జలగడిగిన బంగారాన్ని వారం రోజులపాటు పోగుచేసి వాటిని యాసిడ్‌లో ఉడకబెట్టి మేలిమి బంగారంగా తయారుచేస్తారు. ఆ బంగారాన్ని స్వర్ణకారుల్లోని వ్యాపారులకు విక్రయించి వచ్చిన నగదుతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి, కుటుంబాలను పోషించుకుంటున్నామని పేర్కొంటున్నారు. ఎప్పుడైనా అనారోగ్యం బారిన పడితే... తమకు ప్రభుత్వ దవాఖానే దిక్కు అని, ఈ వృత్తివల్ల తమ పిల్లలను కనీసం ప్రైవేట్ పాఠశాలకు కూడా పంపించలేకపోతున్నామని వివరిస్తున్నారు. అనాధిగా వచ్చిన ఈ వృత్తిని వదలలేక.. చదువు సంధ్యలేని తమకు కొత్త పని దొరక్క ఎన్నో అష్టకష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40ఏళ్లుగా ఈ పనిలోనే కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం తమకు ఎలాంటి సాయం చేయడం లేదని చెప్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ తలరాతలు మాత్రం మారడంలేదని వారు ఆందోళనగా చెప్తున్నారు.

రోడ్లు ఊడ్చుకునేందుకు సరిహద్దులు

యానం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 30 కుటుంబాలు పట్టణంలోని లైన్‌వాడ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరు స్వర్ణకార వీధిని సరిహద్దులుగా పెట్టుకొని ఊడ్చుకుంటారు. ఒకరు ఊడ్చుకునే ప్రాంతంలోకి మరొకరు వెళ్లకుండా ఒప్పందాలు చేసుకొని బతుకుదెరువు కొనసాగిస్తున్నారు. దీంతోపాటు జిల్లాలోని నకిరేకల్, చిట్యాల, చౌటుప్పల్‌వంటి ప్రధానప్రాంతాల్లో కూడా వీరు జీవనం పొందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని, ప్రభుత్వ పథకాలు తమకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యాపారం నిర్వహించుకునేందుకు సబ్సిడీతో కూడిన రుణాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మా రాతలు మారలేదు

30 ఏళ్లుగా రోడ్లు ఊడ్చుకుంటూ, డ్రైనేజీ కాల్వల్లో వెతుక్కుంటూ బతుకుతున్నాం. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా తలరాతలు మాత్రం మారడంలేదు.

గౌరయ్య, కార్మికుడు, నల్లగొండ



పొద్దున లేస్తే డ్రైనేజీ కడగడమే..

నిద్రలేవగానే రోడ్డు మీదికి రావడమే మా పని. రోడ్లు ఊడ్చుకున్న తర్వాతే ఇంటికి వెళ్లి వంట చేయడం, పిల్లలను బడికి పంపించడంలాంటివి చేస్తాం. బతుకు దెరువుకోసం కంపుతో సావాసం చేయడం అలవాటైపోయింది.

అంజమ్మ, కార్మికురాలు, నల్లగొండ



తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకున్నాం

చదువులేక కొత్త వృత్తిలోకి పోలేక ఈ వృత్తినే నమ్ముకొని పనిచేస్తున్న. పొద్దస్తమానం పనిచేస్తే ఒక్కోసారి రోజుకు రూ.300కూడా రావడంలేదు. మా తలరాతలు ఎన్నడు మారుతాయో? ఏమో?

పెంచలయ్య, కార్మికుడు, నల్లగొండ

పోలీస్ కుటుంబం సోదరుడిని కోల్పోయింది



● ఎస్పీ నరసింహ

కమలాకర్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటక్రైం, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): పోలీస్ కుటుంబం సోదరున్ని కోల్పోయిందని సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ అన్నారు. నాగారం మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన కానిస్టేబుల్ కమలాకర్ మృతదేహం వద్ద ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ కుటుంబం ఒక సోదరుడిని కోల్పోయిందన్నారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కానిస్టేబుల్ శీలం కమలాకర్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ, నాగారం సీఐలు వెంకటయ్య, నాగేశ్వర్‌రావు, ఎస్‌బీఐ రామారావు, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లకొండ రాంచందర్‌గౌడ్‌తో పాటు మరికొంత మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు

కోదాడ రూరల్: కానిస్టేబుల్ కమలాకర్ అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామం మండలంలోని గుడిబండ గ్రామంలో అధికార లాంఛనాలతో కన్నీటి వీడ్కోలు నడుమ జరిగాయి. కమలాకర్ నాగారం వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా, గుర్తుతెలియని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో గుడిబండ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కమలాకర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియల్లో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, నాగారం సీఐ నాగేశ్వరరావు, కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, మేళ్లచెర్వు ఎస్ఐ పరమేశ్, అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలకు పాల్పడితే చర్యలు

లాటరీలు, పెట్టుబడికి రెట్టింపు డబ్బులు అంటూ ప్రజలను మోసం చేసే ఆర్థిక మోసాలకు పాల్పడేవారిపై చట్టపరంగా చర్యలు తీసకుంటామని ఎస్పీ కొత్తపల్లి నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో అక్కడక్కడ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవస్థీకృతంగా ఏర్పడి వెయ్యి కొట్టు..., ప్లాట్ పట్టు అంటూ లాటరీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిని చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. లాటరీలు, తక్కువ పెట్టుబడితో రెట్టింపు లాభాలు అంటూ చెప్పే వారి మాయ మాటలు ప్రజలు నమ్మవద్దన్నారు.

19న సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

హాలియా/ నిడమనూరు, వంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో ఈనెల 19వ తేదీన సీనియర్ మహిళలు, పురుషుల కబడ్డీ నల్లగొండ జిల్లా జట్ల ఎంపికను నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శు లు ఆర్.భూలోకరావు, కర్తయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషుల విభాగంలో 85కిలోలు, స్త్రీ విభాగంలో 75 కిలోల బరువు కలిగి ఉండాలని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో 19వ తేదీన మధ్యాహ్నం జరిగే ఎంపికకు హాజరు కావాలని సూచించారు. జిల్లా నుంచి ఎంపిక అయిన క్రీడాకారులు కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు దీక్షిత



నల్లగొండ/ కనగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లాకు చెందిన విద్యార్థిని ఎంపి కైంది. కనగల్ మండలం జి.యడవల్లి విద్యార్థిని పర్సనబోయిన దీక్షిత కర్నాటక రాష్ట్రంలోని తుముకూర్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో జిల్లా నుంచి పాల్గొంటుందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి విజయ లక్ష్మి, పిజికల్ డైరెక్టర్ నారాయణ కవిత తెలిపారు. దీక్షిత ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

కొత్త కాలనీల్లో ఉపాధి



ఉరుకుల.. పరుగుల జీవితంలో కంటి నిండా నిద్ర, కడుపునిండా తిండి కరువై ఎంతో మంది అనారోగ్యం పాలవుతుంటారు. పొద్దస్తమానం కష్టపడి ఇంటికొచ్చి మళ్లీ వంట చేసుకునే సమయం లేక చాలా మంది ఫుడ్ డెలివరీలపై ఆధారపడి ఊబకాయం, మధుమేహం తదితర రోగాల బారిన పడుతుంటారు. అలాంటి వారికోసం.. ఇంటి వద్దే ఉంటూ.. ఇంటిని చూసుకుంటూ.. రుచికరమైన వంటలు చేస్తున్నారు ఈ మహిళలు. పనిచేసే ఇంటిని సొంతిల్లులా చూసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

- ఇంటిని చూసుకుంటూ.. రుచికరమైన వంట చేస్తూ..
- ఉపాధి పొందుతున్న మహిళలు
- తోటమాలి, సెక్యూరిటీ గార్డులకు పురుషులకు ఉపాధి

కార్పొరేట్ విద్యాసంస్థల ఏర్పాటు... పారిశ్రామిక విస్తరణ ఫలితంగా వెలుస్తున్న కొత్త కాలనీలు మహిళలకు ఉపాధి కేంద్రాలుగా మారుతున్నాయి. కంపెనీల్లో పనిచేసే ఉన్నత ఉద్యోగులు.. కార్పొరేట్ (ఎంబీబీఎస్) కాలేజీల్లో చదివే బ్యాచ్‌లర్ విద్యార్థులు నివాసం ఉండే కొత్త కాలనీలు ముఖ్యంగా మహిళలకు ఉపాధిని కల్పిస్తున్నాయి. ఉద్యోగ బాధ్యతల్లో తీరిక క్షణం లేకుండా అలసిపోయే ఉన్నత ఉద్యోగులు..., కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు ఒక్కోసారి తినడానికి కూడా సరైన సమయం దొరకదు. అలసిపోయి రాత్రి ఏ వేళకో ఇంటికి చేరుకుని డ్యూటీ సమయం వరకూ నిద్రిస్తూనే ఉంటారు. అలాంటిది తెల్లారే లేచి.. స్వయంగా వారే వండుకుని తినడం... ఇంటి పనులు చేసుకోవడం లాంటివి వాళ్లకు కొంచెం కష్టమైనపనే. దీంతో తమ ఇంటి... వంట పనులకు ఇతరులపై ఆధారపడాల్సి రావడంతో ఇంటి.. వంట పనులను చేసేలా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మగవారికైతే డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డు, తోటమాలి వంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుండగా ఆడవాళ్లకు ఇంటి, వంట పని చేసేలా ఉన్న ఊర్లోనే కొత్త కాలనీలు ఉపాధిని కల్పిస్తున్నాయి. ఎక్కడికో దూర ప్రాంతాలకు వెళ్లి కూలో.. నాలో చేయడం కన్నా ఉన్న ఊర్లోనే నీడపట్టునే లభిస్తున్న ఉపాధితో మహిళలు కుటుంబ పోషణలో ఆసరాగా ఉంటున్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని 'సన్‌షైన్' కాలనీలో సుమారు 51మంది మహిళలు ఇలా ఇంటి, వంట పనిచేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.

ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున ఇస్తారు



నాది నార్కట్‌పల్లి మండలంలోని పోతినేనిపల్లి గ్రామం. గతంలో నేను కామినేని ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేశాను. ఆస్పత్రిలో పనిచేస్తున్నపుడు పరిచయమైన వైద్య విద్యార్థులు నా పనితీరు చూసి ఇంటి, వంట పనిచేయాలని అడిగారు. దీంతో కామినేని ఆసుపత్రిలో స్వీపర్ ఉద్యోగం మానుకుని ఐదేళ్లుగా కాలనీలో ఇంటి వంట పనిచేస్తున్నా. ఉదయాన్నే వచ్చి అన్ని పనులు చేసి సాయంత్రం ఇంటికి వెళ్తా. ఒక్కొక్కరికి నెలకు రూ.3,000 చొప్పున ఇస్తున్నారు.

- భీంపాక పూలమ్మ, పోతినేనిపల్లి

గుర్తింపు కార్డులు ఇచ్చాం



కాలనీలో మొత్తం 104 గృహాలు ఉన్నాయి. వీటిలో దాదాపు సగానికిపైగా ఇళ్లలో డాక్టర్లు... వైద్య విద్యార్థులు నివాసముంటున్నారు. వారి ఇళ్లలో ఇంటి, వంట పనిచేసేందుకు వచ్చే మహిళలకోసం గుర్తింపు కార్డులు ఇచ్చాం. సుమారు51మంది మహిళలు కాలనీలో ఇంటివంట పనిచేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. నమ్మకంగా పనిచేసే వారికే కాలనీలో పనిచేసే అవకాశం ఇస్తాం. ఏ మాత్రం ఫిర్యాదువచ్చినా అనుమతించం. కాలనీలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది.

- రాముగౌడ్, అధ్యక్షుడు, సన్‌షైన్ కాలనీ అసోసియేషన్, నార్కట్‌పల్లి.

సొంతిల్లులా చూసుకుంటాం



మాది కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెం గ్రామం. సన్‌షైన్ కాలనీలో మూడు ఇండ్లల్లో ఇంటి, వంట పని చేస్తాను. గత 10 సంవత్సరాలుగా ఇదే కాలనీలో ఇంటి, వంట పని చేస్తున్నాను. నేను పనిచేసే ఇల్లు ఎవరిదైనా సొంతిల్లులా భావించి పని చేస్తా. ఇంటి యజమానులు కూడా అంతే నమ్మకంతో మాకు ఇంటిని అప్పగిస్తారు. ఉదయం 6 గంటలకే వచ్చి అల్పాహారం చేసి పెడతాను. తిరిగి ఇంటి యజమానులు మధ్యాహ్నం ఇంటికి వచ్చేలోగా భోజనం సిద్ధంచేస్తాను. ఇలా నెలకు సుమారు రూ.15,000 వరకు సంపాదిస్తున్నాను.

- చింతల రేణుక, ముత్యాలమ్మగూడెం

పదేళ్ల నుంచి వంట పనిచేస్తున్నా



నాది నార్కట్‌పల్లి స్వగ్రామం. గతంలో నేను బట్టల ఇస్త్రీ పనిచేశా. కొత్తగా ఈ కాలనీ ఏర్పడ్డాక కాలనీలో ఉండే ఉద్యోగులు, విద్యార్థులకు ఇంట్లో వంట పని ఇంటి పని చేసేవారు కావాలని తెలియడంతో సంప్రదించి పదేళ్లనుంచి కాలనీలో ఇంటి వంట పనిచేసే ఉపాధిని చూసుకున్నా. ప్రస్తుతం ఓ డాక్టర్ ఇంట్లో ఇంటి వంట పని చేస్తున్నా. నెలకు రూ.6,000 సంపాదిస్తున్నాను. ప్రతీరోజూ వారికి అల్పాహారం, భోజనం వండటంతోపాటు ఇంటిని శుభ్రం చేయడం, బట్టలు ఉతకడం వంటివి చేస్తా.

- దామనూరి లక్ష్మమ్మ, నార్కట్‌పల్లి

మత సామరస్యానికి ప్రతీక

మతం వేరైనా ఆ కుటుంబం ఇతర మతాన్ని కూడా గౌరవిస్తోంది. ఇంట్లోనే ఏకంగా పరమత పూజలు, అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటింది. హిందూ- ముస్లిం ఐక్యతా రాగానికి ఆ ముస్లింల ఇల్లు వేదికగా నిలిచింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో జరిగిన ఈ ఘటన ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది.

- ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్



షేక్ అలీపాషా కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్న అయ్యప్ప మాలధారులు

బూరుగడ్డ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ షేక్ సలీమాబేగం చిన్న కుమారుడు షేక్ అలీపాషా, ఆశా దంపతులు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు పిల్లలు మున్నా, రిజ్వానా ఉన్నారు. ఆ గ్రామంలో 54మంది యువకులు అయ్యప్ప దీక్షలో ఉన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం బూరుగడ్డ గ్రామంలో ఆ 54 మంది అయ్యప్ప మాలధారులకు అలీపాషా తన ఇంట్లోనే అయ్యప్ప పూజ చేయించి, అన్నదానం ఏర్పాటుచేశారు. ఉదయం 11నుంచి 12 గంటల వరకు గణపతి పూజ, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, శివ, వెంకటేశ్వరస్వామి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేసి మత సామరస్యాన్ని చాటారు. కాగా బూరుగడ్డ గ్రామంలో యువకులు రెండు బృందాలుగా ఏర్పడి అయ్యప్పమాలలు ధరించి బూరుగడ్డలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం నిత్యపూజలు చేస్తున్నారు. ఈ రెండు బృందాల అయ్యప్ప మాలధారులు కూడా షేక్ అలీపాషా, ఆశా దంపతులు ఇంట్లో పూజలు చేసి ఐక్యతను చాటారు. అలీపాషా తల్లి బూరుగడ్డ సర్పంచ్‌గా పనిచేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు యరగాని రామస్వామి, నరేష్, వెంకన్న, కిరణ్‌గౌడ్, సతీష్, సైదులు, వీరబాబు పాల్గొన్నారు.

సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం ఎప్పుడో?

● ఆశగా ఎదురు చూస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో, ఎత్తైన కొండలను, కోనలను దాటుకుంటూ కృష్ణమ్మ ఒడిలో ఆరు గంటలపాటు 110 కిలోమీటర్లు నీటిపై ప్రయాణం.. అక్కడ నుంచి మరో 15కిలోమీటర్లు బస్సులో వెళ్లి శ్రీశైల మల్లిఖార్జునిడి దర్శించుకోవడం.. ప్రతి ఒక్కరికీ జీవితంలో మరచిపోలేని ఓ మధురానుభూతినిస్తుంది. ఇంతటి ఆహ్లాదకరమైన ప్రయాణం ఈ ఏడాది ఎప్పుడో? అని పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు, భక్తులు ఎదురుచూస్తున్నారు. సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం సాగర్ జలాశయంలో నీటి మట్టం 560 అడుగులకు (ప్రస్తుతం 586.50 అడుగులుగా ఉంది) పైన ఉన్నప్పుడు కొనసాగుతుంది. నీటి మట్టం 560 అడుగుల దిగువకు చేరితే లాంచీ అడు గు భాగాన కొండలు, గుట్టలు తాకుతాయి కాబట్టి లాంచీలు నడపరు. ఈ ఎడాది సాగర్ జలాశయానికి ముందస్తుగా వరద వచ్చి పూర్తి స్థాయికి చేరింది. ప్రతీ సంవత్సరం కార్తీక మాసం సమయంలో సాగర్-శ్రీశైలం లాంచీలను నడుపుతారు. దీంతో భక్తులు శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనం కోసం లాంచీలో అధికంగా వెళతారు. గత ఏడాది నవంబరు 2వ తేదీన సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం ప్రారంభంనుంచి డిసెంబరు 31వ తేదీ వరకు మొత్తం 10 ట్రిప్పులు లాంచీలు నడిపారు. దీంతో పర్యాటక శాఖకు సుమారు రూ. 15లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది ఇప్పటికే సోమశిల-శ్రీశైలం లాంచీ ప్రయాణం ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నప్పటికీ నేటి వరకు సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణంపై పర్యాటక శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోకపోవడంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారు.



సాగర్ నుంచి శ్రీశైలం బయలుదేరిన లాంచీ(ఫైల్)

యాదగిరి క్షేత్రం భక్తజన సంద్రం



యాదగిరిగుట్ట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఇష్టదైవాల దర్శనాలు, కార్తీక మాసంలో సత్యదేవుని వ్రతాలు, కార్తీక దీపాలు వెలిగించే భక్తులతో వారాంతపు సెలవు దినం ఆదివారం యాదగిరి దివ్యక్షేత్రం పోటెత్తింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వా హనాలతో కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశా లు నిండిపోయాయి. 1,06,700 మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక దర్శనం గంట, ఉచిత ధర్మదర్శనం రెండున్నర గంటల సమయం పట్టగా క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనుల రద్దీ కొనసాగింది. సాధారణ భక్తుల కోసం తగినన్ని బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ గంటల తరబడి ఎదురుచూశారు. కొండపైన బస్టాండు ప్రాంగణం వాహనాలతో పూర్తిగా నిండిపోగా వాహనాల మధ్య నుంచి బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు.

రికార్డుస్థాయి ఆదాయం: ఆదివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.1,04,52,688 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. ఇటీవల నమోదైన అత్యధిక ఆదాయమని ఈవో చెప్పారు. కాగా, కొండకింద వ్రత మండపాల్లో 1,862 మంది దంపతులు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నారు. కాగా కొండపైన హరిహరులకు నిత్యపూజలు శాస్త్రోక్తంగా సాగాయి. ఆర్కిటెక్చర్ ఆనందసాయి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ప్రోటోకాల్ దర్శనాల నిలిపివేత: స్వామివా రి చెంత ప్రోటోకాల్ దర్శనాలు నిలిపివేశారు. 15, 16, 17 తేదీల్లో నేరుగా సంప్రదించిన ప్రముఖులకే ప్రోటోకాల్ దర్శనాలని ఈవో ఆదేశాల మేరకు దర్శనాలను పరిమితి చేశారు. ప్రోటోకాల్ కార్యాలయాన్ని శనివారం సందర్శించి ఈవో సిఫారసులు లేవని ఆదేశించినప్పటికీ యథావిధిగా కొనసాగడం పట్ల ప్రోటోకాల్ అధికారులు, ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కూడా ఈవో ఆదేశాలను అధికారులు అమలు చేయనున్నారు.



ఆలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

దర్వేశిపురం వెళదాం..వేడుక చేద్దాం

- శుభకార్యాలకు చిరునామాగా ప్రసిద్ధి
- రేణుకా ఎల్లమ్మ సన్నిధిలో శుభకార్యాలు చేసేందుకు పోటాపోటీ
- ఫంక్షన్‌హాళ్లకు యమ గిరాకీ



శుభకార్యాలు చేయాలంటే 'చలో దర్వేశిపురం' అన్న చందంగా మారింది. ఇక్కడ ప్రసిద్ధిగాంచిన రేణుకా ఎల్లమ్మ కొలువుతీరి ఉన్నందున, ఆ దేవత సన్నిధిలో శుభకార్యా లు నిర్వహించుకోవడానికి భక్తులు మక్కువ చూపుతున్నారు. దీంతో నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ శుభకార్యాలకు చిరునామాగా మారింది. నిత్యం శుభ కార్యాలయాలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్రాంతంలో రోజురోజుకూ ఫంక్షన్ హాల్స్ పెరుగుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి - కనగల్)

దర్వేశిపురం స్టేజీ వద్ద శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. నిత్యం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దేవస్థానం కేంద్రంగా హోటళ్లు, చికెన్ సెంటర్లు, ఆట వస్తువులు, బొమ్మలు, పూ జా దుకాణాలతో ఈ స్టేజీ రోజురోజుకు విస్తరిస్తోంది. అదే విధంగా ఈ దేవత సన్నిధిలో శుభకార్యాలయాలు నిర్వహించుకోవడానికి ప్రజలు మక్కువ చూపుతున్నందున, ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాళ్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ఈ దేవాలయంలో ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పన కేంద్రంగా తయారైంది.. ఇటీవల జరిగిన మద్యం టెండర్లలో దర్వేశిపురం వైన్స్‌కు అత్యధిక దరఖాస్తులు దాఖలు చేశారు. వేలంలో జిల్లాలో వరుసగా రెండోసారి ఇక్కడి వైన్స్‌కు అత్యధిక ధర పలికింది. ఈ ఒక్క అంశం చాలు దర్వేశిపురం స్టేజి ప్రాంతానికి ఎంత డిమాండ్ ఉందో అర్థమవడానికి అమ్మవారి గుడి చుట్టుపక్కన 25ఏళ్ల క్రితం ఖాళీ పంట భూములు ఉండేవి. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో భూములకు గిరాకీ ఏర్పడింది.

వేడుక ఏదైనా ఇక్కడే..

ఈ ప్రాంతంలో వివాహాలు, పుట్టినరోజు పార్టీలు, షష్ఠిపూర్తి వేడుకలు, గెట్ టు గెదర్ పార్టీలు, పట్టు వస్త్రాలంకరణ మహోత్సవాలు, అన్నప్రాశన, తలనీలాలు తీయించడం లాంటి వాటికి ప్రజలు ఎక్కువగా వస్తున్నారు. తక్కువ నుంచి అధిక బడ్జెట్ వరకు ఫంక్షన్ హాల్ ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. మినీ ఫంక్షన్‌హాళ్లు, పేద్ద ఏసీ ఫంక్షన్‌హాళ్లు 50కి పైగానే ఉన్నాయి. పేద, మధ్య, ధనిక తరగతుల ప్రజలకు అభిరుచులకు అనుగుణంగా ఫంక్షన్‌హాళ్లు అద్దె(కిరాయి)కి లభిస్తున్నందున ఈ ప్రాంతం ఒక ఆకర్షణీయ ప్రాంతంగా మారింది.

అందుబాటు ధరల్లో ఫంక్షన్ హాళ్లు



దర్వేశిపురం స్టేజీ వద్ద శుభకార్యాలు నిర్వహించుకోవాడానికి అందుబాటు ధరల్లో ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. మినీతో పాటు పెద్ద ఏసీ ఫంక్షన్ హాళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. పట్టణ ప్రాంత ఫంక్షన్‌హాళ్లకు ధీటుగా వీటిల్లో సౌకర్యాలు ఉన్నాయి. సీజన్‌ను అనుగుణంగా ధరల్లో కొద్ది పాటి మార్పులతో అద్దెకు ఇస్తున్నాం.

- కంచరకుంట్ల రవీందర్‌రెడ్డి, ఫంక్షన్‌హాల్ యజమాని, దర్వేశిపురం స్టేజీ

ఫంక్షన్ హాళ్ల సంఖ్య పెరిగింది



దర్వేశిపురం స్టేజీ వద్ద ఫంక్షన్ హాళ్ల సంఖ్య ఎనిమిదేళ్ల నుంచి గణనీయంగా పెరిగింది. అమ్మవారి సన్నిధిలో శుభాకార్యాలు నిర్వహించుకోవడానికి ఎల్లమ్మ భక్తులు, ప్రజలు ఇష్టపడుతున్నారు. అన్ని రకాల సదుపాయాలు, కొత్త కొత్త హంగులతో ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను నిర్మించారు. ఫంక్షన్‌హాళ్లతో పాటు ఎల్లమ్మ దేవత కొలువుదీరి ఉన్నందున దర్వేశిపురం స్టేజీ పలు వ్యాపారాలకు కేంద్రంగా మారింది.

- చీదేటి వెంకట్‌రెడ్డి, రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్, దర్వేశిపురం

తామరాకుల విస్తర్లతో ప్లాస్టిక్‌కు చెక్



విస్తరాకులు చేస్తున్న మహిళ

ప్లాస్టిక్‌తో కూడిన విస్తర్లు బదులు తామరాకులతో తయారు చేసినవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆరోగ్యానికి హాని చేకూర్చే ప్లాస్టిక్‌కు చెక్ పెట్టేలా ఆకులతో తయారు చేసినవి తళుక్కుమంటున్నాయి. వీటిపై వినియోగదారులు మక్కువ చూపడంతో తామరాకుల వినియోగం ఎంతో పెరిగింది. తామరాకులతో విస్తర్లు తయారు చేసి కొంత మంది ఉపాధి పొందడం విశేషం.

- (ఆంధ్రజ్యోతి - సూర్యాపేట టౌన్)

జిల్లా కేంద్రంలో కొంత మంది మహిళలు తామరాకులతో విస్తర్లు తయారు చేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ విస్తర్లకు చెక్ పెట్టినట్లవుతోంది. జిల్లా కేంద్రంలో 28 ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. వీటిలో జరిగే శుభకార్యాలయాలకు ప్లాస్టిక్ విస్తర్లకు బదులు తామరాకులతో తయారు చేసిన విస్తర్ల వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. తామరాకుల విస్తర్లతో పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య పరిరక్షణతో పాటు కాలుష్యానికి అడ్డుకట్ట వేయవచ్చని స్థానికులు చెబుతున్నారు.

ఉపాధితో పాటు పర్యావరణ పరిరక్షణ

ఒడిశా నుంచి ఆకుల దిగుమతి..

ఒడిశా నుంచి సూర్యాపేటకు తామరాకులను దిగుమతి చేసుకుంటున్న మహిళలు, ప్రత్యేక యంత్రాల సాయంతో తామర విస్తారాకులను తయారు చేస్తున్నారు. సూర్యాపేటలో ప్రస్తుతం మూడు తామర విస్తరాకుల తయారీ పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాలో ఎనిమిది ఉన్నాయి. ఈ పరిశ్రమల స్థాపకులంతా మహిళలే. స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆసరాగా ఉండటంతో పాటు కొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. తామరాకులతో తయారు చేసిన విస్తర్లు ప్లాస్టిక్ విస్తర్ల కన్నా కొంచె ఖరీదు ఎక్కువ. 20 ప్లాస్టిక్ విస్తరాకులు కట్ట రూ.20 నుంచి రూ.30లు ఉండగా, తామర విస్తరాకుల కట్ట రూ.24 నుంచి రూ.50వరకు ఉంది. ధరలో ఈ వ్యత్యాసం ఉన్నందున తామరాకుల విస్తర్ల వినియోగం పూర్తిస్థాయిలో జరడంలేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి



తామరాకులతో విస్తర్లను తయారు చేస్తే ఖర్చు అధికంగా వస్తోంది. ఉపాధి మెరుగుపడేలా ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. తామర విస్తారాకుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. తామర విస్తర్ల వ్యాపారాన్ని మహిళలే చేస్తున్నారు. స్వయంఉపాధితో పాటు కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు.

- మౌనిక, తామర విస్తరాకుల తయారీదారు

ఆరోగ్యానికి మేలు



తామరాకుల విస్తర్లు పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వివిధ ఇస్తారాకుల డిజైన్లు మార్కెట్‌లో లభించడం బాగుంది. శుభకార్యాల్లో తప్పనిసరిగా తామర విస్తర్లను వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- భాగ్యమ్మ, తిమ్మాపురం

వివిధ రకాల ఉత్పత్తులు

తామరాకులతో విస్తర్లతో పాటు ఎన్నో రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. తయారు చేసిన దేవాలయాల్లో ప్రసాదాలు పంచే చిన్న కప్పులు, టిఫిన్ ప్లేట్లు వంటివి తయారు చేస్తున్నారు. వీటి ముడి సరుకుకు డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయాల్సివస్తోందని, అందుకే ప్లాస్టిక్ ఉత్పత్తుల కన్నా తామరాకుల ఉత్పత్తుల ఖర్చు అధికమవుతోందని తయరీదారులు వాపోతున్నారు. ముడిసరుకుల ధరలను ప్రభుత్వం తగ్గిస్తే ధర తగ్గి ప్రజలందరికీ అందుబాటులోకి వస్తాయని తయారీదారులు చెబుతున్నారు.

వైభవంగా శ్రీకోటమైసమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చండీహోమంలో పాల్గొన్న ఈవో, చైర్మన్ దంపతులు

నిడమనూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం సమీపంలో ప్రసిద్ధి చెందిన శ్రీకోటమైసమ్మ అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. పతీ ఏటా కార్తీకంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మొదటిరోజు సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజా, చండీహోమం, మహాపూర్ణాహుతి, సహస్రనామ పారాయణం, నీరాజనం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. బ్రహ్మోత్సవాలతో పాటు ఆదివారం కూడా కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చెవిటి ఆంజనేయులు దంపతులు, ఈవో సిరికొండ నవీన్, విఠలేశ్వర్, రమణయ్య, శ్రీనివాస్, రాజు, నర్సిరెడ్డి, కోటయ్య, లక్ష్మి, వెంకన్న, పద్మ, స్వాతి, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మునుగోడు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలం పలివెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు గేరా నర్సింహను శనివారం రాత్రి జిల్లా విద్యాధికారి బిక్షపతి సస్పెండ్ చేసినట్లుగా ఎంఈవో మల్లేశం తెలిపారు. వివరాల్లోకి వెళితే ఆ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి శివశంకర్ ఆంజనేయ స్వామి మాల వేసినందుకు మాల దుస్తులతో పాఠశాలకు రావద్దని ఉపాధ్యాయుడు అన్నారు. ఇది తెలిసిన బీజేవైఎం నాయకులు సదరు ఉపాధ్యాయుడిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అనంతరం పై అధికారుల ఆదేశాలమేరకు సస్పెండ్ చేసినట్లు ఎంఈవో తెలిపారు.

నల్లగొండ

నకిరేకల్ - మునుగోడు

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

శాలిగౌరారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కార్మికులు ఉద్యమించాలని తెలంగాణ కార్మిక సమైఖ్య జిల్లా అధ్యక్షుడు దేవరకొండ మస్తాన్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పెర్కకొండారం గ్రామంలో ఆదివారం సమైఖ్య కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇందిరా పార్కులో నవంబరు 27న జరిగే కార్మికుల సభను విజయవంతం చేయాలని కోరారు. 42శాతం బీసీ రిజర్వేషన్ మద్దతుగా పోరాటం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి జానియాదవ్, దేవరకొండ కృష్ణ, దేవరకొండ లక్ష్మణ్, మేదర రవికుమార్, యాతాకుల అంజయ్య, దేవరకొండ బిక్షమయ్య, మహమ్మద్ జమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



అభివాదం చేస్తున్న నాయకులు

రామగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనలో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మేక రాంరెడ్డి, అధ్యక్షుడిగా కోడి సోమయ్య, ఉపాధ్యక్షుడిగా ఉక్లా, ప్రధాన కార్యదర్శిగా, కోమ టిరెడ్డి అనంత రెడ్డి, కార్యదర్శిగా పోతూరి శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా ఎమ్. అంజయ్య ఎన్నికయ్యారు. రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై, కూలీ ఉద్యమాలు, మద్దతు ధర, స్వామినాథన్ సిఫారస్ అమలుపై తీర్మానం చేశారు.

కపాస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న నకిరేకల్ ఇన్‌చార్జి ఏడీఏ జానిమియా

కేతేపల్లి, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): పత్తి సాగు చేసిన రైతులు కిసాన్ కపాస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని నకిరేకల్ ఇన్‌చార్జి ఏడీఏ ఎండీ. జానిమియా సూచించారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో కిసాన్ కపాస్ యాప్ పట్ల రైతులకు ఏఈవోలు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. రైతులు తాము పండించిన పత్తిని సీసీఐల్లోనే అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. పత్తి విక్రయానికి ఏర్పాటు చేసిన కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్‌బుక్ చేసుకుని యాప్‌లో పేర్కొన్న మిల్లుకు మాత్రమే నిర్ణీత తేదీలో పత్తిని తీసుకెళ్లాలన్నారు. నిర్ణీత తేదీన పత్తిని మిల్లుకు తీసుకెళ్ళ లేని పక్షంలో బుక్ చేసుకున్న స్లాట్‌ను రద్దు చేసుకునే వీలు సైతం కపాస్ యాప్‌లో ఉందన్నారు. స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత రైతువేదికలో అందుబాటులో ఉండే ఏఈవోలను సంప్రదించి స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ప్రసాద వితరణ



అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న దాతలు

నార్కట్‌పల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని అయ్యప్ప స్వామ ఆలయంలో దీక్షా స్వాములకు నిత్య అన్న ప్రసాద వితరణను ఆదివారం ప్రారంభించారు. తొలిరోజు స్థానిక కాంగ్రెస్ నాయకుడు జాల సైదులు మంజుల దంపతులు దీక్షా స్వాములకు భిక్షా దానం చేశారు. ఆలయ చైర్మన్ గురుస్వామి బెల్లి వెంకన్న మాట్లాడుతూ దీక్షా సమయం ముగిసే వరకూ ఆలయంలో దీక్షా స్వాములకు నిత్యం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అయ్యప్ప మాధారణ స్వాములకు అన్న ప్రసాద వితరణకు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బూరుగు సంతోష్, గోదల మహేందర్‌రెడ్డి, రాపర్తి మోహన్, బోయపల్లి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం సతీమణి పుష్ప

నకిరేకల్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే అవసరమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప అన్నారు. నకిరేకల్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మాట్లాడుతూ ప్రతి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. పోటీలలో 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత, రాపోలు సుదర్శన్, కరాటే మాస్టర్ బంధాల ప్రమీళ, శ్రీధర్ సాగర్, విశ్వనాథ్, ఆర్ విజయ్‌కుమార్, అంజి శివరామ్, అంతటి సోములు, మధు మాస్టర్ పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నకిరేకల్, నవంబర్ 16, (ఆంధ్రజ్యోతి): రవాణ రంగ కార్మికులకు ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వంటిపాక వెంకటేశ్వర్లు అన్నారు. నకిరేకల్‌లో ఆదివారం జరిగిన మినీ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సీఐటీయూ అనుబంధ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రవాణ రంగంలో అనేక మంది కార్మికులు జీవనోపాధికై డ్రైవర్స్ ఓనర్స్, క్లీనర్‌గా పని చేస్తున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో పి. రాంబాబు, మల్లేష్, సుధాకర్, మాదయ్య, శ్రీను, జానయ్య, అక్కనపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురుకులం.. అసౌకర్యాలకు నిలయం



గురుకుల పాఠశాలలో భోజనం వడ్డించుకుంటున్న విద్యార్థులు

- కిటికీలు, మరుగుదొడ్లకు తలుపుల్లేని దుస్థితి
- చెర్వుగట్టు గురుకుల పాఠశాల నిర్వహణపై తల్లిదండ్రుల ఆగ్రహం

నార్కట్‌పల్లి, నవంబరు 16,(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు రెవెన్యూ శివారులోని సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాల(కళాశాల) అసౌకర్యాలకు నిలయంగా మారింది. నిర్వహణ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య తమ పిల్లలు ఎలా చదువు కొనసాగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో పాల్గొన్న వారు పాఠశాలలో సౌకర్యాల లేమిపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 2వ శనివారం వర్షాల కారణంగా పేరెంట్స్, టీచర్ల సమావేశం నిర్వహించలేదు. దీంతో శనివారం నిర్వహించిన సమావేశానికి హాజరైన కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలో ఉన్న అసౌకర్యాలను స్వయంగా చూసి ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 400మందికి పైగా చదువుతున్న ఈ భవనంలో సరైన వసతులు లేనట్లు గుర్తించారు. మరుగుదొడ్లకు తలుపుల్లేని వైనం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భవనంపై భాగంలో ఉన్న కిటికీలకు అద్దాలు సరే కనీసం ఇనుప గ్రిల్స్ కూడా లేవని తెలిపారు. ఈ కిటికీలో నుంచి ఎవరైనా కిందకు దూకి ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. వంట మాస్టర్లు భోజనం వండి పోతే విద్యార్థులే స్వయంగా వడ్డించుకుంటు న్నదీ చూసి ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని వారు చెబుతున్నారు. పరిశుభ్రత మరీ దారుణంగా ఉందన్నారు. అసలే చలికాలం ఆపై కిటికీలకు తలుపులేని గదుల్లో వణుకుతూ విద్యా ర్థులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చెందారు. కనీసం విద్యాభ్యాసమైనా సజావుగా ఉందా అంటే అదీ లేదనే విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. భవనంలో సరైన వసతులు కల్పించక పోవడంపై ప్రిన్సిపాల్ బాలాజీని పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు ప్రశ్నించగా, తాను ఏ వసతీ కల్పించలేనని, భవనాన్నే ఖాళీ చేయాలని లేఖ ఇచ్చానని చెప్పారని పేర్కొన్నారు.



చెర్వుగట్టు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో తలుపులు లేని కిటికీలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

చండూరు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పెదగోని వెంకన్నగౌడ్ ఆరోపించారు. సన్న ధాన్యం మరో కొన్ని రోజులు కొనుగోలు చేసేది లేదని అధికారులు చెప్పడంతో కోసిన ధాన్యం ఎక్కడ ఆరపోయాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించిందని గుర్తు చేశారు.

మొక్కు కల్యాణాలు

కనగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి కార్తీక మాస భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి దంపతులు అర్చకులు శ్రవణా చార్యులు, దామోదర్‌రావ్ ఆధ్వర్యంలో అమ్మ వారికి మొక్కు కల్యాణం నిర్వహించారు.

లిఫ్టు ద్వారా చెరువు నింపేందుకు కృషి



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు రూరల్, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): మండలం కోటయ్యగూడెం గ్రామంలో ఉన్న మాదన్న చెరువును లిఫ్టు ద్వారా నింపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మాదన్న చెరువును కురంపల్లి గ్రామం నుంచి వెళ్లే ఎస్ఎల్‌బీసీ కెనాల్ నుంచి పైప్‌లైన్ ద్వారా లిఫ్టు చేసి నింపాలని గ్రామస్తులు గతంలో ఎమ్మెల్యేని కోరగా, ఆదివారం ఆయన కోటయ్యగూడెం మాదన్నచెరువును పరిశీలించారు. చెరువు నిండితే కోటయ్యగూడెంతో పాటు పక్కనే ఉన్న ఉడుతలపల్లి, కస్తాల గ్రామ ప్రజలకు ఎంతగానో తోడ్పడుతుందని, ఈ చెరువు కింద ఉన్న భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఈ చెరువుకు పైప్‌లైన్ గతంలో జి. ఎడవల్లి గ్రామం నుంచి చండూరు పట్టణానికి తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ వృథాగా ఉందన్నారు. పైప్‌లైన్‌కు కురంపల్లి కెనాల్ వద్ద ఒక మోటారు ఏర్పాటు చేసి, కనెక్షన్ ఇస్తే చాలా తక్కువ ఖర్చుతో మాదన్న చెరువును నింపవచ్చని ఆయనకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొరిమి ఓంకారం, గంట సత్యం, మాజీ సర్పంచ్ వెంకన్న, శంకర్, విశ్వనాథ్, వెంకన్న తదితరులున్నారు. అదేవిధంగా మండలంలోని తాస్కానిగూడెం గ్రామానికి చెందిన షేక్ లతీఫ్, మున్నాబి దంపతులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి అబ్బనబోయిన లింగయ్య, పల్లె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్రానిదే



న్యాయ సాధన దీక్షలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నల్లగొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీ కళాశాల ఎదుట న్యాయసాధన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికైనా చట్టం చేస్తూ ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే పార్లమెంట్లో బిల్లు పెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చినట్లయితే చట్టబద్రత ఉంటుందన్నారు. దాని బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందేనని 42 శాతం చట్టబద్ధత కల్పించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెళ్ళ విజయ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బక్కతట్ల వెంకన్న యాదవ్, జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్‌గౌడ్, నాయకులు గద్దె నాగరాజు, మల్లెబోయిన సతీష్ యాదవ్, సుంకరబోయిన శివకుమార్ యాదవ్, కట్ట హరిబాబు, కుకుడాల ఏడుకొండలు, సట్టు యాదగిరి, వీరమల్లు నాగరాజు గౌడ్, పాల్గొన్నారు.

పశు వైద్యానికి నిధులు అరకొరే

(5వ పేజీ తరువాయి)

పశువులతో పాటు గొర్రెలకు, మేకలకు ప్రస్తుత సీజన్‌లో రోగాలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని బహుళార్థక పశు వైద్యశాలతో పాటు ప్రాంతీయ పశు వైద్య శాలలు, ప్రాథమిక వైద్యశాలలు, సబ్ సెంటర్లు, సంచార వైద్యశాలల్లో పోస్టుల భర్తీ లేకపోవడంతోపాటు నిధుల కొరతతో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి. వస్తున్న అరకొర నిధులతో 130 రకాల మందులను కొనుగోలు చేయలేక అధికారులు, వైద్యులు చేతులెత్తేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పశుసంవర్ధకశాఖ నిధులు లేక నీరసించిపోగా, ప్రస్తుత ప్రభుత్వం సైతం నిధులు కేటాయింపునకు తత్సారం చేస్తోంది. రానున్న రోజుల్లో పశు సంవర్ధకశాఖకు నిధులు భారీగా ఉంటాయని భావిస్తున్నా, పాడి రైతులు మాత్రం సందేహం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు రోగాలు రావడంతో రైతులు సంబంధిత పశువైద్యశాలలకు వెళ్లినప్పుడు స్థానిక డాక్టర్లతో పాటు



సిబ్బంది, కాంపౌండర్లు ఉన్న మందులతోనే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మందుల సరఫరా సైతం అరకొరగా ఉన్నప్పుడు అధికారులు, డాక్టర్లు ఏమి చేయలేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో పశుసంవర్ధకశాఖపై పెద్దగా దృష్టిసారించినట్లుగా కానరావడం లేదు. దీని వల్లనే మూగ జీవాలు వైద్యానికి సమస్యగా మారిందని చెప్పవచ్చు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మర్రిగూడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరమని మాల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, మర్రిగూడ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రామదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యానికి గురైన గుణగంటి ఎల్లయ్య, బండా పద్మాలకు అస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.60వేల చొప్పన 1లక్ష20వేలు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధిత లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాస నీలిమ చంద్రశేఖర్, ఎరుపుల శ్రీశైలం, బిచ్చునాయక్, శేఖర్, నర్సింహారెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

రాంనగర్ పార్కులో వనభోజనాలు

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాంనగర్ పార్కులో ఆదివారం జరిగిన వనభోజన మహోత్సవంలో ఏబీసీడీ ఆనంద నిలయం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి శశికళ, ఏఎస్‌డబ్ల్యూ స్వామి, హెచ్‌డబ్ల్యూఓఎస్ విజయలక్ష్మి, స్వప్న, భారతమ్మ, సత్యావతి, తయాబా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



కేతేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండల కేంద్రంలో ఈ నెల 20, 21తేదీల్లో నిర్వహించే డీవైఎఫ్ఐ 17వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ చెరుకు రమేష్ కోరారు. ఆదివారం మండల కేంద్రం కేతేపల్లిలో పలువురు డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభలకు అధిక సంఖ్యలో యువతీ యువకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఊర శ్రీకాంత్, గణేష్, సతీష్, నాగరాజు, రమేష్, రాము, పరమేష్ పాల్గొన్నారు.

యాదవుల ఆత్మగౌరవ ప్రతీక సదర్



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల, నవంబరు16,(ఆంధ్రజ్యోతి): సదర్ ఉత్సవం యాదవుల ఆత్మగౌరవ ప్రతీక అని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్యయాదవ్ అన్నారు. ఈ నెల 17న నల్లగొండలో నిర్వహించే సదర్ సమ్మేళనం పోస్టర్లను ఆదివారం చిట్యాలలో ఆవిష్కరించారు. యాదవులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సదర్ ఉత్సవానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దొంగరి కిరణ్, జడల చినమల్లయ్య, కాటం వెంకటేశం, మెండె సైదులు, గుండెబోయిన సైదులు, ఏర్పుల పరమేశం, అశోక్, మధు పాల్గొన్నారు.

బహిరంగసభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్

చిట్యాల, నవంబరు16, (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చే నెల 26వ తేదీన ఖమ్మంలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలనీ ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. ఆదివారం చిట్యాలలో జరిగిన సీపీఐ మండల సమావేశంలో మాట్లాడారు. పార్టీ పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం పోరాడుతుందన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాతా ఈనెల 19న చిట్యాలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొడిగె సైదులు, మండల కార్యదర్శి ఎండీ. అక్బర్, జిల్లా సత్యం, గుండాల సత్తయ్య, దేశగోని బాలరాజు, కడగంచి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అచ్చాలు

చిట్యాల, నవంబరు16, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వయో వృద్ధుల సమ్యలు పరిష్కరించాలని మాజీ జడ్పీటీసీ, వయో వృద్ధుల సంఘం నాయకుడు పామునగుల్ల అచ్చాలు డిమాండ్ చేశారు. ప్రపంచ వయోవృద్ధుల దినం సందర్భంగా ఆదివారం చిట్యాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో 11శాతం ఉన్న వయో వృద్ధుల అవసరాలు, ఇబ్బందులను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 2007 తల్లిదండ్రుల పోషణ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునగాల నాగిరెడ్డి, నాతి ముత్తిలింగం, జిల్లా సత్తయ్య, సాయిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పొన్నం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


చండ్ర పుల్లారెడ్డి ఆశయాలు సాధించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నకిరేకల్, నవంబరు 16,(ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ నిర్మాత, ప్రతిఘటన పోరాట రూపకర్త చండ్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నకిరేకల్ డివిజన్ కార్యదర్శి అంబటి రంజీవి అన్నారు. హైదరాబాద్‌లోని సుందర్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించే పుస్తకావిష్కరణ సభ పోస్టర్‌ను నకిరేకల్‌లో ఆవిష్కరించారు. చండ్ర పుల్లారెడ్డి భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వలస రాజ్య పాలనకు వ్యతిరేకంగా విద్యార్థులను పోరాటం వైపు కదిలించిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి గజ్జి రవి, పీవోఎల్ జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు, నాయకులు పుట్ట సత్యం, మామిడి ఎల్లయ్య, చెడిపల్లి కాశీరాం, బొల్లికొండ లింగయ్య, గుత్తా వెంకట్‌రెడ్డి, గిరి వెంకన్న, మారయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 17 నవంబరు 2025
గరిష్ఠం 27.0
కనిష్ఠం 16.2
***



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.50 (302.9125)	14,274	14,274
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.10 (4.22)	1,352.42	1,568.68
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పశు వైద్యానికి మందుల కటకట ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖకు మందుల కొనుగోలు కోసం అరకొర నిధులు కేటాయిస్తుండటంతో అధికారులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. పశుసంపదను కాపాడాలని, పాడి ఉత్పత్తులను పెంచాలని, గొర్రెలు, మేకలను సంపదను పెంచి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నా నిధుల కేటాయింపు మాత్రం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)


పశు వైద్యానికి నిధులు అరకొరే

- ప్రతీ మూడు నెలలకోసారి రూ.1.50కోట్లు మాత్రమే
- వాస్తవానికి కావాల్సిన నిధులు రూ.6.50కోట్లపైనే
- నిధులు విడుదలలోనూ ఎడతెగని జాప్యం
- 130 రకాల మందులు కొనుగోలు చేయలేని పరిస్థితి

ప్రభుత్వం పశు వైద్యం కోసం నిధులు నామమాత్రంగా కేటాయించడంతోపాటు, మేకల, గొర్రెల యూనిట్ల పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పశువైద్య, ఆ శాఖ బలోపేతం కోసం కేటాయించిన నిధులు నామమాత్రమే. దీంతో పశు వైద్యానికి ఉన్న మందులతోనే సంబంధిత శాఖ అధికారులు నెట్టుకువస్తున్నారు. పశువులకు ఏదైనా జబ్బు చేసినప్పుడు సంబంధిత యజమాని పశువుల దవాఖానాకు వెళ్తే రోగానికి అనుగుణంగా వైద్యులు మందులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో జీవాల యజమానులు ప్రైవేట్ దుకాణాల్లో మందులు కొనుగోలుచేసి వినియోగిస్తున్నారు. అదేవిధంగా సంబంధిత శాఖకు ల్యాబ్ కూడా అందుబాటులో లేకపోవడం, ఉన్న ల్యాబ్‌లో సరైన పరికరాలు కూడా లేవు.

7.56లక్షలకు పైగా పశువులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పశుగణన ప్రకారం 7,56,300 తెల్ల, నల్ల పశువులు ఉండగా, 24లక్షల వరకు మేకలు, గొర్రెలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 1,80,200 గేదెలు, ఆవులు ఉండగా, నల్లగొండ జిల్లాలో 3,20,600 గేదెలు, ఆవులు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 2,5,500 గేదేలు, ఆవులు ఉన్నాయి. పశువులు, జీవాలకు వైద్యం అందించేందుకు ఉమ్మడి జిల్లాకు ప్రతి మూడు నెలలకొకసారి (క్వార్టర్లీ) రూ.6.50కోట్లు అవసరం. కాగా, ప్రభుత్వం కేవలం రూ.1.50కోట్లు మాత్రమే ప్రస్తుతం మంజూరు చేస్తోంది. అవి కూడా ఆరు నెలలకోసారి నిధులుచెల్లిస్తోంది. దీంతో మూడు నెలలకోసారి మందులు కొనుగోలుచేయలేక శాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మందుల కోసం ప్రతీ మూడు నెలలకు నల్లగొండ జిల్లాకు రూ.60లక్షలు కేటాయిస్తుండగా, యాదాద్రి జిల్లాకు రూ.40లక్షలు, సూర్యాపేట జిల్లాకు సుమారు రూ.50లక్షలు కేటాయిస్తోంది. ఈ నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రత్యేకంగా నట్టల మందుల కోసం రూ.2కోట్ల వరకు నిధులను ప్రభుత్వం మంజూరు చేయగా, సాధారణ రోగాల మందులకు సంబంధించిన కేటాయింపులు ఉండటం లేదు. నట్టల నివారణ కోసం ప్రత్యేకంగా ప్రతీ ఆరు నెలలకు రాష్ట్ర స్థాయిలో కేటాయింపులు జరుగుతున్నాయి. అంతే తప్ప పశువైద్యానికి మాత్రం నిధులు నామమాత్రంగా ఉంటున్నాయి. మూడు జిల్లాలకు చెందిన పశుసంవర్ధక శాఖ అధికారులు జిల్లాలో ఉన్న పశుసంపదకు అనుగుణంగా మందుల కోసం ఇండెంట్ పెడుతున్నా కేటాయింపులు సాధారణంగానే ఉంటున్నాయి.



130 రకాల మందుల కొనుగోలు ఎలా?

పశువుల మందుల కొనుగోలు కోసం ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం క్వార్టర్లీ కేవలం రూ.1.50కోట్లు మాత్రమే నిధులు కేటాయిస్తోంది. దీంతో 130 రకాల మందులను ఎలా కొనుగోలుచేయాలో తెలియగా పశుసంవర్ధకశాఖ అధికారులు ఇబ్బందిపడుతున్నారు.

- మిగతా 8వ పేజీలో...

పశువుల వైద్యానికి సరిపడా మందులు ఉన్నాయి

పశువైద్యానికి సరిపడా మందులు ఉన్నాయి. పశువుల వైద్యం కోసం ఎలాంటి ఇబ్బంది లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకొకసారి మందుల కొనుగోలు కోసం నిధులు కేటాయిస్తుంది. పశువుల సంఖ్యకు అనుగుణంగా మందుల కోసం నిధులు వస్తున్నాయి. ప్రతి పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువులకు వచ్చే వ్యాధులను దృష్టిలో ఉంచుకొని మందులు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నాం. ఆయా ప్రాంతాలలో ఉండే రైతులు తమ పశువులను ఆయా వైద్యశాలలకు తీసుకెళ్లి వైద్యం చేయించాలి. అదేవిధంగా డాక్టర్లు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యాన్ని నిరంతరం అందజేస్తున్నారు.

- డాక్టర్ జీవీ. రమేష్, పశుసంవర్ధకశాఖ జేడీ నల్లగొండ

నేటి నుంచి పాఠశాలల తనిఖీ

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే



మోత్కూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయనుంది. పాఠశాలల్లో వసతులు, విద్యార్థుల రక్షణ, పరిశుభ్రత, అభ్యసనా సామర్థ్యాల పరిశీలనకు విద్యాశాఖ స్పెషల్ క్యాంపెయిన్ 5.0 పేరుతో పాఠశాలల తనిఖీ చేపట్టేందుకు నిర్ణయించింది. అందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను సైతం నియమించింది. యాదాద్రి జిల్లాలో పాఠశాలల తనిఖీకి ఇన్‌చార్జిగా పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ లింగయ్యను, నల్లగొండకు ఎస్‌ఈఆర్టీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.రాజేష్‌ను, సూర్యాపేట జిల్లాకు నల్లగొండ డైట్ ప్రిన్సిపాల్ నర్సింహను నియమించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తించిన పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలలను ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు తనిఖీ చేయనున్నారు. జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తారు. వీరు తొలి రోజు ఐదు పాఠశాలలను తనిఖీచేస్తారు. రెండో రోజు మూడు పాఠశాలలను తనిఖీచేసి అదేరోజు జిల్లా కేంద్రంలో డీఈవోతో కలిసి ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తారు.

తనిఖీ చేసే అంశాలివే..

పాత ఫైళ్లు, పగిలిన వస్తువులు, మరమ్మతు చేయలేని ఫర్నీచర్ తొలగింపు, భవనాల పైకప్పులపై నీరు నిల్వకుండా చేసిన పనులను తనిఖీచేస్తారు. దెబ్బతిన్న పాఠశాలల్లో ఎలక్ట్రికల్ వైరింగ్, ఫ్యాన్లు, లైట్లు మెయింటెనెన్స్ గ్రాంట్ నుంచి వేయించడం, గోడల పగుళ్లు, తలుపులు, కిటికీల్లో లోపాలు ఉంటే సవరించారా? లేదా? చూస్తారు. మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావడం, గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ సిబ్బంది సహాయంతో పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్ల తొలగింపును పరిశీలిస్తారు. భవనాలకు హాని కలిగించే చెట్లు ఉంటే తొలగించడం, మరమ్మతులతో వినియోగించుకునే ఫర్నీచర్, పాఠశాల ప్రహరీ వెంట మొక్కలు నాటించారా లేదా చూస్తారు. పాఠశాలల్లో వివిధ సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటారు. భవిష్యత్‌లో పాఠశాలలను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు మండలానికి ఒక బెస్ట్ స్కూల్‌ను ఎంపిక చేసేందుకు ఎంఈవోల నుం చి నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. భవిష్యత్‌లో ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు విద్య అందిస్తారని సమాచారం.

జిన్నింగ్ మిల్లులు సమ్మె విరమించుకోవాలి


కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండలో జిన్నింగ్‌మిల్లుల యజమానులు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లుల యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సమ్మెను విరమించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ, సహకారశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌కు ఫోన్ చేసి జిన్నింగ్ మిల్లుల సమస్యలను వివరించారు. దీంతో రాష్ట్ర అసోసియేషన్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని జిన్నింగ్ మిల్లుల యజమానులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పలు సమస్యల కారణంగా జిన్నింగ్ మిల్లుల యజమానులు పత్తిని కొనుగోలు చేసేందుకు విముఖత చూపారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషిచేస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తిని కొనుగోలు చేసేందుకు సమ్మెను విరమించుకోవాలన్నారు. జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లులకు 18మిల్లుల్లో కొనుగోళ్లు ప్రారంభించామని, మిగిలిన వాటిని కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జిన్నింగ్ మిల్లు యజమానులు పత్తిని కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. పత్తి రైతులు 12 క్వింటాళ్ల వరకు సీసీఐకి విక్రయించవచ్చని, ఈ విషయాన్ని అధికారులు రైతులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఏఈవోల సాఫ్ట్‌వేర్‌లో అందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సీసీఐ కేంద్రాలకు రైతులు నాణ్యమైన పత్తి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి ఛాయాదేవి, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట



- విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రద్దీ
- హైదరాబాద్ వైపు పెద్ద సంఖ్యలో వెళ్తున్న వాహనాలు
- పెద్దకాపర్తి, చిట్యాల వద్ద నిదానంగా ప్రయాణం

చిట్యాలరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులతో 65వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా మారుతోంది. సెలవుల్లో సొంతూర్లకు వెళ్లిన వారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావడంతో ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. చిట్యాల, పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుండగా, అక్కడ వాహనాలను దారి మళ్లించడంతో వాహనాలు నిదానంగా వెళుతున్నాయి. తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు చిట్యాల మీదుగా హైదరాబాద్, భువనగిరి, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ముంబాయి, నాగ్‌పూర్, పలు ప్రాంతాలకు వెళ్తుంటాయి.

దీంతో చిట్యాలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. వాహనాలు ఒకేసారి రావడం, అక్కడక్కడ గుంతలు ఏర్పడటం, చిట్యాల, పెద్దకాపర్తిలో ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుండటంతో ఆయా ప్రాంతాల్లో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయి ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట పడుతోంది. రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బందితో వాహనాలను నియంత్రించారు. అనంతరం వాహనాలు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని మరచిన ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నల్లగొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విస్మరించిందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్‌లు అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓవైపు విద్యార్థులు చలికి వణికిపోతుంటే కనీసం దుప్పట్లు, రగ్గులు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్ర రూపం దాల్చడంతో జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల విద్యార్థులు చలికి వణికిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కలెక్టర్ ప్రభుత్వంతో మాట్లాడి విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు, ఉన్ని స్వెటర్లు అందించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా వసతిగృహ విద్యార్థులు ఉదయం పూట చన్నీటి స్నానాలు చేయడంతో జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. అన్ని వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు వేడి నీటిని ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా పేద మధ్య తరగతి విద్యార్థులందరికీ గత ప్రభుత్వ మాదిరిగా రగ్గులు, స్వెటర్లు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్, సహాయ కార్యదర్శి కరెం రవి, చేగువేరా, హర్షవర్ధన్, నవీన్, జాన్సన్, నవదీప్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దీక్ష

నల్లగొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సన్న ధాన్యానికి బోనస్ చెల్లించాలని, ఫసల్ బీమాను అమలు చేయాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని దీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

నేడు మిర్యాలగూడలో మంత్రుల పర్యటన

ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రులు రోడ్లు, భవన నిర్మాణాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మిర్యాలగూడకు రానున్నారు. సోమవారం కళాశాల నూతన భవనాల ప్రారంభోత్సవం, టీయుఎఫ్ఐడీసీ కింద మునిసిపాలిటీల్లో చేపట్టనున్న డ్రైన్లు, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన కోసం మంత్రులు మిర్యాలగూడకు రానున్న సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రులు ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మిర్యాలగూడ బైపాస్ వద్దకు చేరుకుంటారన్నారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా కాల్వపల్లికి చేరుకుని శెట్టిపాలెం-అవంతీపురం ఔటర్ రింగు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, ఈదులగూడెం బైపాస్ వద్ద కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన భవనానికి ప్రారంభోత్సవం చేస్తారని అన్నారు. పట్టణంలోని సాగర్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్ద మునిసిపాలిటీ పరిధిలో రూ.75.25కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యకలాపాలు శిలాఫలకాలు ఆవిష్కరిస్తారని చెప్పారు. పట్టణంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దేవస్థానంలో మహాఅన్నప్రసాద కార్యక్రమం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో నిర్వహించే విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. వారి వెంట పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, మిర్యాలగూడ తహసీల్దార్ సురేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

మెగా లోక్‌అదాలత్‌లో 6,362 కేసుల పరిష్కారం


ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 6,362 కేసులు పరిష్కరించినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టు విచారణలో ఉన్న కేసులు 548, డ్రంకెన్ డ్రైవ్, ఎంవీ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన కేసులు 2,515 పరిష్కారమయ్యాయన్నారు. ఈ-పెట్టి కేసులు 3,254, సైబర్ క్రైంకు సంబంధించి 45 కేసుల్లో రూ.8,84,642లను బాధితులకు అందజేశామన్నారు. మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, సిబ్బంది కక్షిదారులకు అవగాహన కల్పించారని, ఈ సందర్భంగా అభినందించారు.

ఎస్పీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

ఎస్పీ శరత్‌చంద్రపవార్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్‌ను రూపొందించారు. దాని నుంచి వచ్చే మెసేజ్‌లకు ఎవ్వరూ స్పందించవద్దని ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఫేస్‌బుక్ ప్రొఫైల్ నుంచి డబ్బు గానీ, సమాచారం గానీ అడిగితే స్పందించవద్దని కోరారు. ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సహకరించకపోతే రాజకీయ సమాధి తప్పదు




జిల్లా కేంద్రంలో రన్‌ఫర్ సోషల్ జస్టిస్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై సహకరించని రాజకీయ పార్టీలకు రాజకీయ సమాధి తప్పదని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ చక్రహరి రామరాజు హెచ్చరించారు. బీసీలకు సామాజిక న్యాయం కోసం ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు తరతరాలుగా సామాజికంగా అన్ని రంగాల్లో వివక్షతకు, దోపిడీకి గురవుతున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు దాటినా, నేటికి కూడా చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పించలేదన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారు జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్ పొందుతుంటే బీసీలకు మాత్రం అన్యాయం జరుగుతోందని అన్నారు. బీసీలు ఇప్పటికైనా ఐక్యంగా హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి రాష్ట్రంలో 56శాతం బీసీలు ఉన్నారని లెక్కలు తేల్చి 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి, గవర్నర్, రాష్ట్రపతికి పంపినా స్పందన రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కేశబోయిన శంకర్, కాసోజు విశ్వనాథం, నకిరేకంటి కాశయ్య, చిక్కుల రాములు, ఇంద్రయ్య, కంది సూర్యానారాయణ, నాగులపల్లి శ్యాంసుందర్, బొమ్మరబోయిన కేశవులు, సాయిబాబా, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, సీతారాములు, సత్యనారాయణ, భాస్కర్, శంకరాచారి, సమీర్, శంకర్, మాధవి, మధు, శివ, లింగస్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను బలహీనపర్చే కవిత కుట్రలను సాగనివ్వం

జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చే విధంగా కల్వకుంట్ల కవిత చేస్తున్న కుట్రలను ఇకపై ఎట్టి పరిస్థితుల్లో సాగనిచ్చేది లేదని జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవితను ఇన్ని రోజులు తమ పార్టీ అధినేత కేసీఆర్ కుమార్తె అయినందున గౌరవిస్తూ వస్తున్నామని అందుకే ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేసినా ఇప్పటివరకు ఏమి అనలేదని, ఇక నుంచి తగిన రీతిలో సమాధానం చెప్పి ప్రజల్లో ఎండగడతామన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్, జగదీష్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ పార్టీలో విబేధాలు తేవాలని కవిత చూస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడితే అదే వ్యాఖ్యలు చేస్తున్నారని, సీఎం కంపెనీల్లో కవితకు భాగస్వామ్యం ఉందని, అందుకే ఆమె కాంగ్రె‌స్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్‌ను శత్రువుగా పరిగణిస్తోందని అన్నారు. పార్టీని ఇబ్బందులకు గురి చేస్తున్నందునే కేసీఆర్ ఆదేశంతోనే ఆమెను సస్పెండ్ చేశారన్నారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిని అన్న అని సంబోధిస్తున్న ఆమె, సొంత అన్నను, కుటుంబాన్ని మాత్రం శత్రువుగా చూస్తోందన్నారు. ఆమె వ్యవహారశైలి చూస్తుంటే లిక్కర్ స్కామ్‌లో ఆమె పాత్ర ఉందని భావించాల్సి వస్తుందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లను ఒంటరి చేయాలని కవిత చూస్తోందని, ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో బలహీనపర్చాలని చూస్తే నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని అన్నారు. నిరంతరం ప్రజల మధ్యే ఉండే కేటీఆర్‌ను విమర్శించే అర్హత కవితకు లేదన్నారు. కవితను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీకి వచ్చే సాధారణ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. విలేకరుల సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు నిరంజన్ వలీ, మాలె శరణ్యారెడ్డి, కొండూరు సత్యనారాయణ, అభిమన్యు శ్రీనివాస్, జమాల్ ఖాద్రీ, మైనం శ్రీనివాస్, ఐతగోని యాదయ్య, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మురుగునీటి నుంచే రాకపోకలు

» దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థ వీధుల్లో నిలిచిన మురుగు నీరు » అధికారులు పరిశీలించినా పరిష్కారం కాని సమస్య


బుగ్గబావిగూడెంలో డ్రైనేజీ దెబ్బతినడంతో వీధిలోకి చేరిన మురుగు నీరు

వేములపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వీధులు బురదమయంగా మారడంతో వెళ్లేందుకు గ్రామస్థులు తంటాలు పడుతున్నారు. మండలంలోని బుగ్గబావిగూడెంలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని మురుగునీరు వీధిలో చేరింది. దీంతో దుర్గంధంతో స్థానికులు సతమతవుతున్నారు. రోజుల తరడి మురుగు నీరు ఉండడంతో దోమలకు నిలయంగా మారి రోగాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను సరి చేసి, వ్యర్థ జలాలను గ్రామ శివారులోకి తరలించాలని గతంలో చాలాసార్లు జిల్లా, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. ఇటీవల ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ పాలన అధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శి పరిశీలించగా సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్థులు భావించారు. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో సమస్య అలాగే ఉంది. పలు ఇళ్లలో మురుగునీరు గ్రామ వీధుల్లోకి చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చేసేదేమీలేక గ్రామస్థులు ఈ మురుగునీటి పక్క నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వృద్ధులు, చిన్నారుల రాకపోకల సమయంలో అదుపుతప్పి మురుగునీటిలో కిందపడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల వృద్ధిచెంది మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని కోరుతున్నారు.

దుర్వాసనతో ఇళ్ల నుంచి వెళ్లలేని పరిస్థితి



ఇళ్ల నుంచి మురుగు నీరు వచ్చి వీధిలో చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇంటి నుంచి బయటికి వచ్చే పరిస్థితి లేదు. గతంలో ఉన్న డ్రైనేజీని కొందరు ధ్వంసం చేయడంతో మురుగు నీరు వీధుల్లోనే నిలుస్తోంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు.

- కోట్ల శంకర్‌రెడ్డి, బుగ్గబావిగూడెం, గ్రామస్థుడు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

గతంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను కొందరు ధ్వంసం చేయడంతో మురుగునీరు వీధిలో నిలిచిపోతుంది. ఇదే విషయమై అట్టి వారిని హెచ్చరించడం జరిగింది. త్వరలోనే డ్రైనేజీని పునరుద్ధరించి మురుగునీరు నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట ఏర్పాటు చేస్తున్న ప్రధాన డ్రైనేజీలోకి మళ్లించి గ్రామ శివారు ప్రాంతానికి తరలించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

దండ జితేందర్‌రెడ్డి, ఎంపీడీవో

అడుగడుగునా గుంత.. వెళ్లేందుకు తంటా


చింతపల్లి మండలంలోని ఘడియాగౌరారం గ్రామానికి వెళ్లే

చింతపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బీటీ రహదారులకు గత ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసినా నేటికీ మోక్షం కలగడం లేదు. టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభంకాలేదు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఈ రహదారుల గుండా గ్రామస్తులు, వాహనదారులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు గుత్తేదారులకు నోటీసులు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. మండలంలోని ఘడియగౌరారం గ్రామం నుంచి హరిజనపురం వరకు రూ. 2.56 కోట్లు, నరసర్లపల్లి నుంచి నెల్వలపల్లి గ్రామం వరకు రూ.1.76 కోట్ల వ్యయంతో బీటీ రహదారి మరమ్మతుల కోసం కోసం 2023లో సెప్టెంబరు 9న అప్పటి విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. ఏళ్లు గడుస్తున్నా రోడ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి కదలిక లేదు. దీంతో రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, గ్రామస్థులు తమ రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఘడియాగౌరారం నుంచి నాంపల్లి మండలం వరకు, నసర్లపల్లి గేట్ నుంచి తిర్మలపురం, నెల్వలపల్లి నుంచి నాంపల్లి మండల కేంద్రానికి వెళ్లే బీటీ రోడ్లు పూర్తిగా వర్షానికి గుంతలమయంగా మారాయి. ఘడియాగౌరారం మీదుగా గతంలో అధిక లోడ్‌తో ఇసుక, కంకర లారీలు జోరుగా రాకపోకలు కొనసాగించడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. బీటీ రోడ్ల మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, అనంతరం ప్రభుత్వం మారడంతో ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. ప్రారంభించని పనులను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఈ రోడ్ల నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి.

నోటీసులు అందిస్తాం

రోడ్ల మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో బీటీ రహదారి నిర్మాణ పనులు సాగడం లేదు. కాంట్రాక్టర్లకు త్వరలోనే నోటీసులు అందిస్తాం. బీటీ రహదారుల నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన తర్వాత పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.

- లింగారెడ్డి, (పీఆర్‌డీఈ)చింతపల్లి

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి

నేరేడుగొమ్ము, నవంబరు16(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు సీసీఐ కేంద్రాల వద్ద ఎదురు చూడకుండా పత్తిని విక్రయించేందుకు ప్రతి రైతు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్‌బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి యాదగిరి తెలిపారు. రైతులు సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకుని వెళ్లి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లే ముందు తాము ఏ రోజు సీసీఐ కేంద్రానికి వెళ్లాలని అనుకుంటారో ముందుగానే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని వెళ్లాలన్నారు. సీసీఐ కేంద్రానికి తీసుకవెళ్లడంతో వచ్చే సమస్యలు పరిష్కరించుకొని పత్తిని సులువుగా విక్రయించుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

త్రిపురారం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ శ్రీనివాస్‌రెడ్డి పెద్ద కుమారుడు వెంకటరమణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇంటికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

చట్టపరమైన రిజర్వేషన్లు కల్పించాలి


నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

దేవరకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టపరమైన రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో దేవరకొండలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల వివక్ష, అన్యాయాన్ని వీడనాడాలన్నారు. 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. పార్టీపరమైన రిజర్వేషన్లు బీసీలకు అవసరంలేదని, చట్టపరమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో చేర్చి శాశ్వతమైన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చొల్లేటి భాస్కరచారి, వెంకటేశ్వర్లు, కోటేశ్వర్‌రావు, వీరయ్య, వరికుప్పల శ్రీను, భాషానాయక్, శివగౌడ్, చందునాయక్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి'

మిర్యాలగూడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన క్లాత్ మర్చంట్ వర్కర్స్ అసోసియేషన్ డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. క్లాత్ మర్చంట్ కార్మికులతో యాజమాన్యాలు 12 గంటలు పని చేయించుకుంటున్నారన్నారు. రోజంతా కష్టపడినా వర్కర్‌లకు సరైన జీతం అందడం లేదని అన్నారు.మరో వైపు నిత్యావసరాల ధరలు పెరగడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకోకుండా అడ్డుకుంటున్నారన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డబ్బికార్ మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా దైద దేవయ్య, ఉపాధ్యక్షులుగా రాపోలు శ్రీనివాస్, జె. గురువయ్య, సహాయ కార్యదర్శులుగా రఘుకుమార్, వెంకటస్వామి, కోశాధికారిగా సుబ్బారావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి, నాయకులు పరుశరాములు, రవినాయక్, తదిరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను రోడ్లపై వేయొద్దు


వ్యర్థ పదార్థాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మిర్యాలగూడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యర్థ పదార్థాలను రోడ్లపై వేయవద్దని 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గోదాల జానకిరామ్‌రెడ్డి అన్నారు. మునిసిపల్ సిబ్బంది సహకారంతో ఎక్స్‌కవేటర్, ఐదు ట్రాక్టర్లను ఏర్పాటు చేసికాలనీ మధ్యలో ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించినట్లు తెలిపారు. వ్యాపారస్థులు, కాలనీవాసులు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాథోడ్, ఉపేందర్, యశ్వంత్, శంకర్ పాల్గొన్నారు.

పశు వైద్యానికి నిధులు అరకొరే

(5వ పేజీ తరువాయి)

పశువులతో పాటు గొర్రెలకు, మేకలకు ప్రస్తుత సీజన్‌లో రోగాలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని బహుళార్థక పశు వైద్యశాలతో పాటు ప్రాంతీయ పశు వైద్యశాలలు, ప్రాథమిక వైద్యశాలలు, సబ్ సెంటర్లు, సంచార వైద్యశాలల్లో పోస్టుల భర్తీ లేకపోవడంతోపాటు నిధుల కొరతతో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి. వస్తున్న అరకొర నిధులతో 130 రకాల మందులను కొనుగోలు చేయలేక అధికారులు, వైద్యులు చేతులెత్తేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పశుసంవర్ధకశాఖ నిధులు లేక నీరసించిపోగా, ప్రస్తుత ప్రభుత్వం సైతం నిధులు కేటాయింపునకు తత్సారం చేస్తోంది. రానున్న రోజుల్లో పశు సంవర్ధకశాఖకు నిధులు భారీగా ఉంటాయని భావిస్తున్నా, పాడి రైతులు మాత్రం సందేహం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు రోగాలు రావడంతో రైతులు సంబంధిత పశువైద్యశాలలకు వెళ్లినప్పుడు స్థానిక డాక్టర్లతో పాటు సిబ్బంది, కాంపౌండర్లు ఉన్న మందులతోనే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మందుల సరఫరా సైతం అరకొరగా ఉన్నప్పుడు అధికారులు, డాక్టర్లు ఏమి చేయలేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో పశుసంవర్ధకశాఖపై పెద్దగా దృష్టిసారించినట్లుగా కానరావడం లేదు. దీని వల్లనే మూగ జీవాలు వైద్యానికి సమస్యగా మారిందని చెప్పవచ్చు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

త్రిపురారం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాగడప, చెన్నైయిపాలెం గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. రైతుల అభ్యున్నతికి దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ2,389, సాధరణ రకానికి రూ. 2,369లు మద్దతు ధర లభిస్తుందని, సన్న రకం ధాన్యానికి రూ. 500లు బోనస్ కూడా అందిస్తున్నామని అన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే భూమికి సంబంధించిన పత్రాలను నిర్వాహ కులకు రైతులు అందజేస్తే ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ సలహదారుడు అనుముల శ్రీనివాస్‌రెడి, నిడమనూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకతి సత్యం, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అంబటి సోమయ్య, భాస్కర్‌నాయక్, బిట్టు రవికుమార్ పద్మ, అనుముల వెంకట్‌రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, బంకు శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నరేష్, భాస్కర్, వీరయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

గుర్రంపోడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రూ.20కోట్లు మంజూరు చేస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా నిధులు మంజూరు చేయలేదన్నారు. మండలంలో ఏడు బ్రిడ్జిలకు నిధులు మంజూరైతే వాటిపై శ్రద్ధ చూపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నాగార్జునసాగర్ కమల నెహ్రూ ఆసుపత్రిలో 17 మంది చిన్నారులకు ఇంజక్షన్ వేస్తే వికటించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎమ్మెల్యే ఛైర్మన్‌గా ఉన్న ఆస్పత్రి పనితీరుపై పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సకాలంలో యూరియా దొరకకా ఐకేపీ, సీసీఐ కేంద్రం తెరవకపోవడంతో తాము పండించిన వరి, పత్తిపంటలను అమ్ముకోలేని దయనీయస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నాగులవంచ తీరుపతిరావు, మాజీ వైస్ ఎంపీపీ వజ్జ ధనంజయ్య, మేకల వెంకట్‌రెడ్డి, కామల రాములు, కోనూరి సైదిరెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటయ్య, దోటి గణేష్, సైదులు, మహేందర్, చంటి యాదవ్, రాంబాబు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం రిజర్వేషన్‌ల సాధనకు బీసీ జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంవద్ద బీసీ సంఘం నాయకుడు తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, మండలిలో తీర్మానం చేసిందన్నారు. బిల్లును కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. బిల్లు అమలు పర్చకుండా గవర్నర్ వద్ద పెండింగ్‌లో వుంచిందని అన్నారు. ప్రతి బీసీ బిడ్డ రిజర్వేషన్ అమలు కోసం ఉద్యమం చేపట్టి బిజేపి నాయకులపై వత్తిడి తేవాలని కోరారు. కేంద్రం బిల్లును ఆమోదించేలా సమరశీల పోరాటాలు చేస్తూ వత్తిడి పెంచాలన్నారు. బీజేపీ నాయకులు రెండు నాల్కల ధోరణితో బీసీ ప్రజలకు నష్టం వాటిల్లుతోందని అన్నారు. బీసీ ప్రజలు ఐక్యతతో రిజర్వేసన్‌లను సాధించాలని కోరారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ్‌నాయక్, వెంకటేశ్‌గౌడ్, బీసీ నాయకులు తమ్మడబోయిన అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వన భోజనం

చింతపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పాత మాల్‌లోని దివంగత వూరె జగన్ ఆశోక్ వ్యవసాయ క్షేత్రంలో సామూహిక వన భోజన నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ఛైర్మన్ వూరె లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రంలో గణపతి పూజ, తులసీదామోదర కల్యాణంతో పాటు సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భగద్గీత పఠనం చేయాలి: విష్ణుదాసు

చింతపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ భగద్గీత పఠనం చేయాలని ఇస్కాన్ కమిటీ సభ్యుడు విష్ణుదాసు ఆదివారం తెలిపారు. మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)కు చెందిన పొద్దుటూరి దేవేందర్, లలిత దంపతులు 30 రోజులుగా దామోదహారతి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పూజారి వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ, ఈశ్వర్, మారయ్య గౌడ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతపల్లికి ఎమ్మెల్యే బాలునాయక్ రాక

చింతపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దచెరువులో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యశాఖ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు అయ్యప్ప మహాపడి పూజ.

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద నేడు సోమవారం అయ్యప్ప మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి కుక్కల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురుస్వామి సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో 18 మెట్ల కలశపూజ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అయ్యప్ప స్వాములు, అంజనేయ స్వాములు, శివస్వాములు ఈ మహాపడిపూజకు విచ్చేసి వీక్షించి అయ్యప్ప స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సిబ్బంది నిర్లక్ష్యంతోనే చిన్నారుల అస్వస్థత


అస్వస్థతకు గురైన చిన్నారులను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

నాగార్జునసాగర్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఇంజక్షన్ వికటించి 17మంది చిన్నారులు అస్వస్థతకు గురి కావడానికి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి అన్నారు. సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురై చికిత్సపొందుతున్న చిన్నారులను ఆదివారం ఆమె పరామర్శించారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులతో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిగురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఇంజక్షన్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ధనలక్ష్మి, తంగిరాల సైదమ్మ, ఉన్నారు.

కవి అందెశ్రీ మృతి బాధాకరం


అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, సహజకవి అందెశ్రీ మృతి సాహితీ రంగానికి తీరనిలోటని జానపద కళాకారుడు డప్పికర్ పెంటోజీ అన్నారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక, అధ్యాయన వేదిక ఆధ్వర్యంలో దేవరకొండ శాఖ గ్రంథాలయంలో ఆదివారం అందెశ్రీ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తెస్సా నాయకులు నలేశ్వర్‌యాదవ్, పెంటోజీ, శ్రీనివాస్‌గౌడ్, రంజాన్‌బేగ్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అందెశ్రీ సహజకవి అని, తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ రాసి అందరి హృదయాలలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో చొల్లేటి భాస్కరచారి, నల్ల నర్సింహ, టైగర్ జీవా, బిక్కుమాండ్ల లక్ష్మీనారాయణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనరేటర్ 'యోగం'లేదా?



ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న జనరేటర్

వేములపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల విధులకు, పౌర సేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలనే లక్ష్యంతో 2009-10 సంవత్సరంలో నాటి ప్రభుత్వం సుమారు రూ.2లక్షల వ్యయంతో మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జనరేటర్ ఏర్పాటు చేసింది. వాటి వినియోగానికి అవసరమయ్యే డీజిల్ కొనుగోలుకు నిధులు కేటాయించలేదు. ఆ ఖర్చు ఎవరూ భరించాలనేది స్పష్టత లేకపోవడంతో నాటి నుంచి వాటి నిర్వహణపై అధికారులు పట్టించుకోలేదు. దీంతో జనరేటర్ ఎండకు ఎండి వానకు తడిసి పాడవుతోంది. దీంతో కరెంట్ లేని సమయంలో పౌర సేవలకు కొంత మేరా ఆటంకం కలుగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన జనరేటర్లను అధికారులు ఇప్పటికైనా ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

సామర్థ్యానికి మించి తీసుకెళ్లొద్దు

దేవరకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటోలు, వాహనాలపై కెపాసిటీకి మించి ప్రయాణికులను చేరవేస్తే తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు పోలీస్‌శాఖ సూచించిన నియమ, నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. దేవరకొండ పట్టణంలోని ఉప్పువాగు, డిండి రోడ్డు, కల్వకుర్తి రోడ్డులలో వాహనాల తనిఖీలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతోపాటు మండల పరిధిలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు చేపడతామన్నారు.